ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 139 | మంగళవారం 17 ఫిబ్రవరి 2026 | పేజీలు -8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati



## ప్రపంచానికే ఏపీ ఆదర్శం

- సాంకేతిక పాలనకు ప్రపంచ స్థాయి ప్రశంసలు..
- ప్రజలకు వేగవంతమైన సేవలపై అభినందనలు..
- భూరికార్డుల భద్రతకు ఆధునిక రక్షణ చర్యలు..
- పన్నుల వసూళ్లలో పారదర్శక విధానం..
- డిజిటల్ ఆరోగ్య రికార్డులు భేష్..
- తక్కువ వ్యయంతో వైద్య నిర్ధారణ సేవలు..
- పచ్చదనంతో రాజధాని నిర్మాణానికి కితాబు..
- అద్భుతమంటూ బిల్‌గేట్స్ ప్రశసంలు....

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక ఆధారిత పాలన అద్భుతంగా అమలవుతోందని బిల్ గేట్స్ ప్రశంసించారు. బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ చైర్మన్‌గా ఉన్న ఆయన సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష పాలనా కేంద్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన దృశ్య ప్రదర్శన ఫలకాలపై చూపిన వివరాలను ఆసక్తిగా పరిశీలించారు. ప్రజలకు సేవలందించే విధానం, సాంకేతిక వినియోగం ద్వారా వచ్చిన మార్పులపై సమగ్రంగా తెలుసుకున్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలను సమగ్ర సమాచార భాండాగారం ద్వారా అనుసంధానించామని, దీని వల్ల తక్షణ నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమైందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రత్యక్ష సమాచార సేకరణ వ్యవస్థ ద్వారా నలభై రెండు రకాల సమాచారాన్ని ప్రజలకు, ముఖ్యంగా రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. సందేశ సేవల ద్వారా తొమ్మిది వందల ఇరవై ఒకటి ప్రభుత్వ సేవలను ప్రజల మొబైల్ ఫోన్లకు చేర్చామని చెప్పారు. దీనిపై బిల్ గేట్స్ ప్రశంసలు కురిపిస్తూ పౌరసేవల సరళీకరణ మంచి మార్పుని తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు.కురిపిస్తూ పౌరసేవల సరళీకరణ మంచి మార్పుని తీసుకువస్తుందని అభిప్రాయపడ్డారు.రాష్ట్ర ఆర్థిక వృద్ధిని కీలక ప్రమాణాల ఆధారంగా అంచనా వేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూ రికార్డుల భద్రతపై బిల్ గేట్స్ ప్రశ్నించగా ఆధునిక సంకేత భద్రతా విధానంతో భూ రికార్డులను రక్షిస్తున్నామని, ప్రత్యేక గుర్తింపు సంకేతాలు అమలు చేశామని వెల్లడించారు. ప్రభుత్వ పత్రాలను ప్రజలకు సులభంగా అందించేందుకు ప్రత్యేక శోధన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని అధికారులు వివరించారు.

## చంద్రబాబు నా గుడ్ ఓల్డ్ ఫ్రెండ్
### బిల్‌గేట్స్



ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియేట్లో జరిగిన కీలక సమావేశంలో ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగింది. చంద్రబాబును "నా గుడ్ ఓల్డ్ ఫ్రెండ్" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు...భారతదేశంలో వినూత్న ఆవిష్కరణలు వేగంగా ముందుకు సాగుతున్నాయని, అమలు అద్భుతంగా ఉందని గేట్స్ అన్నారు..

2లో

### ప్రాంతీయ ఆర్థిక మండళ్ల ఏర్పాటుతో
## అన్ని జిల్లాల అభివృద్ధి

- విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలుకు బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనలు..
- విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి వృద్ధి ఇంజిన్లుగా గుర్తింపు.
- నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖ ఆర్థిక ప్రణాళిక సిద్ధం..
- విశాఖ ఆర్థిక ప్రాంతంలో 41 అధిక ప్రభావ ప్రాజెక్టులు..
- కేంద్ర, ప్రైవేటు భాగస్వామ్యంతో నిధుల సమీకరణ..
- అన్ని జిల్లాల సమాన వృద్ధి లక్ష్యం



**అమరావతి(తెలుగోడు),ఫిబ్రవరి 16 :**

రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా కొత్త ప్రాంతీయ ఆర్థిక మండళ్ల ఏర్పాటు దిశగా కీలక అడుగులు వేస్తోంది. ప్రాంతాల మధ్య అసమానతలను తొలగిస్తూ ప్రతి జిల్లాకు వృద్ధి ఫలాలు అందేలా ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయడానికి తాజా బడ్జెట్‌లో స్పష్టమైన (మిగతా 2లో)

## బిల్గేట్స్ పర్యటనతో ఏపికి పెరిగిన ప్రాధాన్యత



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఎక్స్‌లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడు తుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు (మిగతా 2లో)

### ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు
## నూతన శోభ

- కేంద్రం 'బెటర్ ఆన్ బోర్డ్ సర్వీసెస్' కార్యక్రమం ప్రారంభం...
- తొలి దశలో ఎంపికైన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్..




**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

భువనేశ్వర్ నుంచి బెంగళూరుకు ఆంధ్రప్రదేశ్ మీదుగా రాకపోకలు సాగించే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్, వందే భారత్ స్లీపర్, అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి ప్రీమియం రైళ్లలో అందిస్తున్న ప్రమాణాలను ఇతర 2లో

## పాడిరైతులకు క్రెడిట్ కార్డు

- పశు పోషణకు ఆర్థిక తోడ్పాటు..
- మూడు లక్షల వరకు రుణ పరిమితి..
- లక్ష అరవై వేల వరకు పత్రాలు అవసరం లేదు..
- నలభై రోజుల్లో చెల్లిస్తే వడ్డీ లేదు..
- ఆలస్యమైతే ఏడుశాతం వడ్డీ వర్తింపు..
- ఏడాదిలోపు చెల్లింపులకు వడ్డీ మినహాయింపు..
- ఆన్లైన్ చెల్లింపుల సౌకర్యం..
- అర్హులందరికీ కార్డు, పాసుబుక్ సమీప పశుసంవర్ధక శాఖలో దరఖాస్తులు....





**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. వ్యవసాయం చేసే రైతులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉన్న వారికి కూడా ఆర్థికంగా బలపడేలా చర్యలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్ర స్థాయికి తీసుకెళ్లి రైతులకు ప్రయోజనం చేకూరేలా చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ దిశగా ముందంజ వేస్తూ పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని అందిస్తోంది.పశువుల పోషణ, దాణా కొనుగోలు, వైద్య చికిత్సలు వంటి అవసరాల కోసం రైతులు తక్షణ ఆర్థిక సహాయం పొందేందుకు ఈ కార్డు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ పథకం ద్వారా రైతులు బ్యాంకుల నుండి తక్కువ వడ్డీకి రుణాలను పొందే సౌకర్యం (మిగతా 2లో)

## సారీ త్రిషా..!

- త్రిషపై వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్న నైనార్ నాగేంద్రన్..
- అసెంబ్లీ ఎన్నికలవేళ తమిళ రాజకీయాల్లో ఉద్రిక్తత..



**చెన్నై (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన పార్టీల మధ్య విమర్శలు, ప్రత్యర్థులపై వ్యక్తిగత ఆరోపణలు సాధారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులను కూడా రాజకీయాల్లోకి లాగుతూ వ్యాఖ్యలు చేయడం వివాదాలకు దారితీస్తోంది. తాజాగా నైనార్ నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి.రాష్ట్రంలో కొత్తగా రాజకీయ పార్టీ ఏర్పాటు చేసిన విజయ్ అసెంబ్లీ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆయనకు మద్దతు సాధించేందుకు అధికార ద్రవిడ మున్నేట్ర కళగం కూటమితో పాటు విపక్ష కూటమిలోని అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం, భారతీయ జనతా పార్టీ ప్రయత్నాలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడిచింది. అయితే భావజాల పరంగా తాను బీజేపీకి వ్యతిరేకమని విజయ్ స్పష్టం చేసిన తర్వాత రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తమైంది.ఈ క్రమంలో నైనార్ నాగేంద్రన్ విజయ్‌పై విమర్శలు గుప్పిస్తూ ఆయన వ్యక్తిగత విషయాలను ప్రస్తావించారు. అదే సమయంలో ప్రముఖ నటి త్రిష పేరు ప్రస్తావించడం వివాదానికి దారితీసింది. విజయ్ ముందు ఇంటి నుంచి బయటికి రావాలని, త్రిష కూడా బయటికి రావాలని చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. సినీ రంగానికి చెందిన వ్యక్తిని రాజకీయ విమర్శల్లోకి లాగడాన్ని పలువురు ఖండించారు.నాగేంద్రన్ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలే కాకుండా బీజేపీ అంతర్గతంగా కూడా అసంతృప్తి (మిగతా 2లో)

### 19 ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన
## ఇషాన్ కిషన్




**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

టీ20 వరల్డ్ కప్‌లో దాయాది దేశాల మధ్య జరిగిన హై-వోల్టేజ్ పోరులో టీమిండియా ఘనవిజయం సాధించింది. భారత బౌలర్ల నిప్పులు చెరిగే బంతులతో విరుచుకు పడటంతో.. పాక్ బ్యాటర్లు బెంబేలెత్తిపోయారు. ఏ దశలోనూ 2లో

### రష్యా నిర్ణయం పైనే
## పసిడి ధరలు

- డాలర్‌తో వాణిజ్యం కొనసాగితే తగ్గనున్న బంగారం..
- అంతర్జాతీయ నిపుణుల వెల్లడి...



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**

అంతర్జాతీయ పరిస్థితులు బంగారాన్ని కంట్రోల్ చేస్తున్నాయి. రష్యా రూబుల్‌తో వ్యాపారం కారణంగా పరిస్థితి దిగజారిందని అంటున్నరు. తిరిగి రష్యా డాలర్‌తో వ్యఆరాన్ని పునరుద్దరిస్తేనే బంగారం రేట్లు దిగి వస్తాయని అంటున్నారు. బంగారం అంటే ఇష్టపడేవారికి పండగలాంటి అంచనాను నిపుణులు వెలువరించారు. ఇప్పుడు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్షన్నర పైగా ఉండగా, ఇది రూ.లక్ష లోపునకు రావచ్చని.. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 5,000 డాలర్ల వద్ద కదలాడుతుండగా, 3,000 డాలర్లకు దిగిరావచ్చని అంచనా వేస్తున్నారు. రష్యా కనుక అమెరికా డాలర్లలో వాణిజ్యాన్ని పునఃప్రారంభించినప్పుడే, ఇది జరుగుతుందని పేర్కొంటున్నారు. అంతర్జాతీయ విపణికి అనుగుణంగా దేశంలో గతేడాది బంగారం, వెండి ధరలు శరవేగంగా దూసుకెళ్లాయి. ఏడాది వ్యవధిలోనే బంగారం ధర 70 శాతానికి పైగా పెరిగి, గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.80 లక్షలకు మించి గరిష్ఠస్థాయిని తాకినా, ప్రస్తుతం రూ.1.59 లక్షల వద్ద ఉంది. అంతర్జాతీయంగానూ ఔన్సు బంగారం ధర 5600 డాలర్లపైకి వెళ్లినా, మళ్లీ ఇప్పుడు 5000 డాలర్ల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించాక, అంతర్జాతీయ అనిశ్చితులు పెరగడంతో, సురక్షితమని భావిస్తూ బంగారంపైకి పెట్టుబడులు వెల్లువెత్తుతుండటమే ధరల వృద్ధికి కారణం. ఆ రెండు దేశాల మధ్య శాంతి చేకూర్చాలని, వచ్చే జూన్ కల్లా యుద్ధాన్ని నిలిపివేయాలనే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉన్నారు. ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సంప్రదింపులు జరిపారు. రష్యా చమురు కొనకుండా, భారత్ సహా పలు దేశాలపై భారీ సుంకాలు విధించడంతో, రష్యా కూడా దారికి వస్తున్న సూచనలున్నాయి. అమెరికాతో వాణిజ్య (మిగతా 2లో)

# చంద్రబాబు నా గుడ్ ఓల్డ్ ఫ్రెండ్



(మొదటి పేజి (తరువాయి)

ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియేట్లో జరిగిన కీలక సమావేశంలో ప్రపంచ ప్రఖ్యాత వ్యాపారవేత్త బిల్ గేట్స్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశం ఆత్మీయ వాతావరణంలో సాగింది. చంద్రబాబును "నా గుడ్ ఓల్డ్ ఫ్రెండ్" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. భారతదేశంలో వినూత్న ఆవిష్కరణలు వేగంగా ముందుకు సాగుతున్నాయని, నిర్ణయాల అమలు తీరు అద్భుతంగా ఉందని గేట్స్ అభిప్రాయపడ్డారు. దేశంలో డిజిటల్ విప్లవానికి బలమైన పునాదులు పడ్డాయని పేర్కొన్నారు. ఈ మార్పులో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. డిజిటల్ పాలన ఆలోచనను ప్రపంచానికి వివరించే ప్రయత్నం తాను చేస్తున్న సమయంలోనే చంద్రబాబు దాన్ని ఆచరణలో పెట్టారని ప్రశంసించారు. తాను తొలిసారి చంద్రబాబును కలిసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ప్రపంచ దేశాల్లో కలిసిన అనేక నాయకుల కంటే చంద్రబాబు ఆలోచనలు ముందున్నాయని తొలి భేటీలోనే గ్రహించానన్నారు. అప్పటి సింగపూర్ ప్రధానమంత్రి లీ క్వాన్ యూ దూరదృష్టి గల నాయకుడని, అలాంటి విజన్ చంద్రబాబులో కనిపించిందని వివరించారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగ ప్రాజెక్టులే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడం తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు ఇది మంచి ఉదాహరణగా నిలుస్తోందన్నారు. మలేరియా, అనీమియా నివారణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాలన్నారు. విద్యారంగంలో కృత్రిమ మేధస్సు వినియోగంపై మాట్లాడిన గేట్స్, విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని తగిన బోధన అందించేందుకు ఈ సాంకేతికత ఉపకరిస్తుందని చెప్పారు. భవిష్యత్తులో విద్యా రంగంలో విశేష మార్పులకు ఇది దారితీస్తుందన్నారు. వ్యవసాయ రంగ ప్రాముఖ్యతపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ రంగం ఎంత కీలకమో చాలామందికి స్పష్టత లేదన్నారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని వివరించారు. రైతులకు సాంకేతికత చేరేలా కృత్రిమ మేధస్సును అనుసంధానం చేసే ప్రయత్నం అభినందనీయమన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో కృత్రిమ మేధస్సు వినియోగం పరిమితమని, అయితే ఆంధ్రప్రదేశ్ దిశగా తీసుకుంటున్న చర్యలు శుభపరిణామమన్నారు. విపత్తు నిర్వహణలో ముందస్తు అంచనాల ఆధారంగా ప్రాణ నష్టం తగ్గించే విధానం అమలు కావడం సంతోషకరమన్నారు. డ్రోన్ల వినియోగంతో పలు సేవలు అందించే ఆలోచన విశేషమన్నారు. సమావేశంలో మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్ పలు ప్రశ్నలు అడిగి అభిప్రాయాలు కోరారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కేంద్రం ఏర్పాటుకు కారణం ఏమిటని ప్రశ్నించగా, సమాచార సాంకేతిక రంగ ప్రోత్సాహం వల్ల అనేక నిపుణులు హైదరాబాద్ నుంచి ముందుకు వచ్చారని గేట్స్ తెలిపారు. అదే సమయంలో మైక్రోసాఫ్ట్ కార్యాలయం అక్కడే ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చంద్రబాబు ముందుంచారని చెప్పారు. సంస్థ ఉద్యోగుల అభిప్రాయం కోరగా హైదరాబాద్ కేంద్రానికి వెళ్లేందుకు సిద్ధమని వారు వెల్లడించారన్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ సంస్థల్లో పనిచేస్తున్న వారిలో హైదరాబాద్‌కు చెందినవారే అధికమని గేట్స్ పేర్కొన్నారు. ఈ సమావేశం ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించినట్లు స్పష్టమైంది. సీఎం దూరదృష్టి, సాంకేతిక వినియోగంపై గేట్స్ చేసిన ప్రశంసలు రాష్ట్రానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి.

# ఆర్థిక మండళ్లతో అన్ని జిల్లాల అభివృద్ధి

(మొదటి పేజి (తరువాయి)

ప్రతిపాదనలు చేసింది. విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలులో భాగంగా ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖపట్టణం, అమరావతి, తిరుపతిని కీలక వృద్ధి ఇంజిన్లుగా ప్రభుత్వం గుర్తించింది. నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్టణం ఆర్థిక ప్రాంతానికి సమగ్ర మాస్టర్ ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు ఈ ప్రాంత పరిధిలోకి వస్తాయని వివరించారు. ఈ ఆర్థిక ప్రాంతంలో తయారీ, సేవలు, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయం రంగాల్లో 41 అధిక ప్రభావ ప్రాజెక్టులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వీటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో సమకూర్చనున్నట్లు తెలిపారు. మెట్రో రైలు ప్రాజెక్టులు సహా సుమారు 28 వేల కోట్ల రూపాయల ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు ఈ ప్రాంతంలో భాగమవుతాయి. ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి అవసరమైన వనరులు, వృద్ధి ఇంజిన్లు, స్థానిక బలాల గుర్తింపునకు శాస్త్రీయ విధానంలో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాయలసీమ సమగ్ర అభివృద్ధి ప్రణాళికను కూడా ప్రభుత్వం సిద్ధం చేసింది. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీ సత్యసాయి, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 303 మండలాల్లో 200కు పైగా గ్లోబల్ ఉద్యాన హబ్‌లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్యానవన రంగాన్ని ప్రోత్సహిస్తూ రైతుల ఆదాయాన్ని పెంచడం, ఉపాధి అవకాశాలు విస్తరించడం ప్రధాన ఉద్దేశ్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రాంతీయ అభివృద్ధి విధానంతో ప్రతి జిల్లాకు సమాన ప్రాధాన్యం కల్పిస్తూ సమ్మిళిత వృద్ధిని సాధించాలనే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి మార్గంలో నిలబెట్టే ఈ కొత్త ఆర్థిక మండళ్ల విధానం అమలు దశకు చేరుకోనుంది.

# ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు నూతన శోభ

(మొదటి పేజి (తరువాయి)

దూర ప్రాంత రైళ్లకూ విస్తరించాలనే లక్ష్యంతో రైల్వే శాఖ ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను తొలి దశ సంస్కరణలకు ఎంపిక చేయడం విశేషం. 'బెటర్ ఆన్ బోర్డ్ సర్వీసెస్' పేరుతో చేపడుతున్న ఈ కార్యక్రమంలో రైళ్లలో పరిశుభ్రత, ప్రయాణికుల సౌకర్యాలు, సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్వరాష్ట్రం అయిన ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి ఏపీ మీదుగా బెంగళూరు వరకు నడిచే ఈ రైలులో సమగ్ర మార్పులు చేయనున్నారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు తూర్పు కోస్తా రైల్వే పరిధిలోని మొత్తం ఆరు రైళ్లలో ఈ సంస్కరణలు అమలు చేయనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జనరల్ కోచ్‌లతో పాటు రిజర్వ్ కోచ్‌లన్నింటినీ సమానంగా పరిశుభ్రంగా ఉంచే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు. ఇంతకుముందు ఎంపిక చేసిన కొన్ని స్టేషన్లలో మాత్రమే రిజర్వ్ కోచ్‌లను శుభ్రపరిచే విధానం అమల్లో ఉండేది. ఇకపై ప్రయాణమంతా నిరంతరాయంగా అన్ని కోచ్‌లలో పరిశుభ్రత నిర్వహణ చేపట్టనున్నారు. తాగునీరు, శౌచాలయాల శుభ్రత, బెడ్‌రోల్స్ నిర్వహణ, ప్రయాణికుల ఫిర్యాదులపై వేగవంతమైన స్పందన వంటి అంశాల్లోనూ మెరుగుదల తీసుకురానున్నారు. మూడు రాష్ట్రాల మీదుగా సుదీర్ఘ దూరం ప్రయాణించే ఈ రైలులో మార్పులు అమలైతే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన అనుభవం లభిస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది కాలంలో అంటే 52 వారాల్లో ఎంపిక చేసిన రైళ్లలో 52 ప్రధాన సంస్కరణలు చేపట్టాలని మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. తొలి దశలో వచ్చే ఆరు నెలల్లోనే దేశవ్యాప్తంగా 80 దూరప్రాంత, రద్దీ రైళ్లను ఇందుకు ఎంపిక చేశారు. దశలవారీగా అమలు చేసే ఈ కార్యక్రమాన్ని వచ్చే మూడేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని రైళ్లకు విస్తరించే ప్రణాళికను కేంద్రం సిద్ధం చేసింది. త్వరలోనే ఈ సంస్కరణలు అమల్లోకి రానుండగా, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులు కొత్త అనుభూతిని ఆస్వాదించే రోజులు దూరంలో లేవు.

# 19ఏళ్ల తర్వాత చరిత్ర సృష్టించిన ఇషాన్ కిషన్

(మొదటి పేజి (తరువాయి)

పోటీ ఇవ్వలేకపోయిన పాకిస్తాన్ జట్టును.. భారత్ 61 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసి, తన అజేయమైన రికార్డును కొనసాగించింది. ముందుగా టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో భారత జట్టు మొదట బ్యాటింగ్ చేసింది. ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా క్రీజులోకి వచ్చారు. అయితే, అభిషేక్ డకౌట్ రూపంలో మొదటి ఓవర్లోనే ఔట్ అయ్యాడు. దీంతో పాక్ ప్లేయర్లు సంబరాలు చేసుకున్నారు. అయితే, వారి ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. టీమిండియా ఓపెనర్ ఇషాన్ కిషన్ పాకిస్తాన్ బౌలర్లపై బ్యాటుతో విరుచుకుపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ హిస్టరీ క్రియేట్ చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ 2007 ఫైనల్ తరువాత పాకిస్తాన్ జట్టుపై హాఫ్ సెంచరీ బాదిన తొలి ఓపెనర్‌గా ఇషాన్ కిషన్ చరిత్రకెక్కాడు. టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా ఆదివారం పాకిస్తాన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 77 పరుగులు చేయడం ద్వారా ఈ ఘనత సాధించాడు. పాకిస్తాన్ జట్టుపై జరిగిన మ్యాచ్‌లో దూకుడుగా ఆడిన ఇషాన్ కిషన్ 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో గత 19 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. గత 19 ఏళ్లలో ఏ భారత ఓపెనర్ కూడా పాక్‌పై టీ20 ప్రపంచ కప్‌లో హాఫ్ సెంచరీ సాధించలేదు. చివరి సారిగా 2007 టీ20 వరల్డ్ కప్ ఫైనల్లో గౌతమ్ గంభీర్ ఓపెనర్‌గా వచ్చి పాకిస్తాన్‌పై హాఫ్ సెంచరీ సాధించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ భారత ఓపెనర్ హాఫ్ సెంచరీ సాధించలేదు. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగినా పాకిస్తాన్ జట్టుపై 50 పరుగులు చేయలేక పోయారు. తాజాగా.. ఆ ఘనతను ఇషాన్ కిషన్ సాధించాడు.

# జెఇఇ మెయిన్ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 16 :

దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) పేపర్-1 ఫలితాలు వచ్చేశాయి. సోమవారం ఉదయం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో తెలుగు విద్యార్థులు సత్తా చాటారు. ఏపీ నుంచి ఇద్దరు, తెలంగాణ నుంచి ఒక విద్యార్థి 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోర్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశంలో ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్ -1 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 29న నిర్వహించిన జేఈఈ మెయిన్ పేపర్-2 ఫలితాలను తర్వాత ప్రకటించనున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,55,293మంది రిజిస్టర్ చేసుకోగా.. 13,04,653 మంది (96.26?) హాజరయ్యారు. ఈ ఫలితాల్లో మొత్తంగా 12మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి నరేంద్రబాబు గారి మహిత్, పసల మోహిత్, తెలంగాణ నుంచి వివాన్ శరద్ మహిశ్వరి ఉన్నారు. మరోవైపు, జేఈఈ మెయిన్ మలి విడత పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ పక్రియ కొనసాగుతోంది. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులను కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తుంటారు.

## ఏఐ సమ్మిట్‌కు భారత్
# వేదిక కావడం గర్వంగా వుంది..మోడీ

ప్రపంచదేశాలకు ప్రధాని ఆహ్వానం




న్యూఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 16 :

దేశ రాజధాని దిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్ ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో జరుగుతుండడం గర్వకారణమన్నారు. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల ఎకోసిస్టమ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

## అన్ని రంగాల్లో
# కృత్రిమ మేధ వినియోగం

సానుకూల దిశగా ఆలోచిస్తేనే మేలు..దుర్వినియోగం చేస్తే దుష్ఫలితాలు తప్పవు

కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ వెల్లడి.. ఏఐ సదస్సుకు భారీ భద్రతా ఏర్పాట్లు




న్యూఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 16 :

అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతు న్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాలన్నారు. ఇదిలావుంటే దేశ రాజధాని దిల్లీ వేదికగా 'ఇండియా- ఏఐ ఇంపాక్ట్ సమిట్' ప్రారంభమైంది. 20వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రధాని మోదీ ఆహ్వానం మేరకు బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యూఏఈ తదితర దేశాల నేతలు హాజరుకానున్నారు. 45కుపైగా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు వేదిక 'భారత్ మండపాన్ని' కృత్రిమ మేధ ఆధారిత నిఘా, ఆధునిక రక్షణ వ్యవస్థలతో శత్రుదుర్భేద్యంగా మార్చారు. వైమానిక దాడులను అడ్డుకునేందుకు భారత్ మండపం కాంప్లెక్స్‌లో అయిదు యాంటీ డ్రోన్ వ్యవస్థలు, నాలుగు ఎయిర్ డిఫెన్స్ గన్‌లను మోహరించారు. ఉగ్రదాడుల వంటి ఘటనలను తిప్పికొట్టేందుకు ఎన్ఎస్‌జీ సహా పలు భద్రతా సంస్థలను రంగంలోకి దించారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ, అంతర్జాతీయ వీవీఐపీల భద్రతా బాధ్యతలను ఎస్పీజీకి అప్పగించారు. సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ బృందాలు భారత మండపం పరిసరాల్లో భద్రతను పర్యవేక్షిస్తున్నాయి. దిల్లీ వీధుల్లో 10 వేలమందికిపైగా పోలీసులను మోహరించారు. సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని 10 జోన్‌లు, 22 సెక్టార్లుగా విభజించారు. వీటిని కమాండ్, కంట్రోల్, కమ్యూనికేషన్, ఇంటెలిజెన్స్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఏఐ కెమెరాల ద్వారా రద్దీ నిర్వహణ, అనుమానాస్పద కదలికలు, గుర్తుతెలియని వస్తువుల విశ్లేషణ చేపడుతున్నారు. డిజిటల్ పాసులు, క్యూఆర్ కోడ్‌ల ద్వారానే అతిథులను లోపలికి అనుమతిస్తున్నారు. వీవీఐపీల రాకపోకల సమయంలో ట్రాఫిక్, సెక్యూరిటీ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విదేశీ అతిథుల కోసం కేంద్రం బుల్లెట్ ప్రూఫ్ కార్లను సమకూర్చింది. వారు బస చేస్తున్న హోటళ్లలో రెండు వారాల నుంచే భద్రతా ప్రొటోకాల్‌లు అమలులో ఉన్నాయి.

# నేడు ప్రధాని మోడీతో ఫ్రాన్స్ అధ్యక్షుడి భేటీ

న్యూఢిల్లీ (తెలుగోడు) ఫిబ్రవరి 16 :

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ మంగళవారం ప్రధాని మోడీతో భేటీ కానున్నారు. మాక్రాన్ భారత్ పర్యటన సందర్భంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపైనా, ప్రాంతీయ ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై చర్చలు జరపనున్నారు. రేపు మోడీ, మాక్రాన్‌లు ముంబయిలో కలవనున్నట్లు అధికారిక ప్రకటన తెలిపింది. మధ్యాహ్నం 3.15 నిమిషాల నుంచి 5.15 నిమిషాల దాకా ముంబయిలోని లోక్‌భవన్‌లో ఇద్దరు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్నారు.

# ఏపికి పెరిగిన ప్రాధాన్యత

(మొదటి పేజి (తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు. వ్యవసాయ రంగంలో కూడా గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం, డ్రోన్ వినియోగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పంటల విశ్లేషణ వంటి విధానాలు రైతుల ఆదాయాన్ని పెంచడంలో సహాయపడతాయని చెప్పుకొచ్చారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చడంలో ఈ భాగస్వామ్యం ముఖ్య పాత్ర పోషిస్తుందని తెలిపారు. బిల్‌గేట్స్ అమరావతి పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న టెక్నాలజీ ఆధారిత పాలన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర, స్థిర అభివృద్ధి లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం కీలకమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# పాడి రైతులకు క్రెడిట్ కార్డులు

(మొదటి పేజి (తరువాయి)

కల్పించబడింది. గరిష్ఠంగా మూడు లక్షల రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉంది. ముఖ్యంగా లక్ష అరవై వేల రూపాయల వరకు ఎటువంటి అదనపు పత్రాలు అవసరం లేకుండానే రుణం మంజూరు చేస్తారు. ఈ మొత్తాన్ని నలభై రోజులలోపు తిరిగి చెల్లిస్తే వడ్డీ వర్తించదు. ఒకవేళ నిర్ణీత గడువులో చెల్లించలేకపోతే ఆ తర్వాత ఏడుశాతం వడ్డీతో రుణాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఏడాది లోపు పూర్తి రుణాన్ని తిరిగి చెల్లించిన రైతులకు భారతీయ రిజర్వు బ్యాంకు, జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం మూడు శాతం వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఈ కార్డు ద్వారా ఆన్‌లైన్ చెల్లింపుల సౌకర్యం కూడా అందుబాటులో ఉంటుంది. రైతులు అవసరమైనప్పుడు డబ్బును వినియోగించుకుని సులభంగా తిరిగి చెల్లించగలుగుతారు. అర్హత కలిగిన పాడి రైతులకు కార్డుతో పాటు పాసుబుక్ కూడా అందజేస్తారు. ఇది నిరంతరంగా సాగే ప్రక్రియగా అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు సమీప పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచిస్తున్నారు. దరఖాస్తు కోసం ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, భూమి పత్రాలు, పశువుల ఆరోగ్య రికార్డు, పాస్‌పోర్టు పరిమాణ ఫోటోలు సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన పాడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశుసంపదను అభివృద్ధి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సారీ త్రిషా..!

(మొదటి పేజి (తరువాయి)

వ్యక్తమైంది. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు తగవని పార్టీ నేతలు సూచించినట్లు తెలిసింది. ఇదే సమయంలో త్రిష తరఫున ఆమె న్యాయవాది నాగేంద్రన్‌కు నోటీసు తరహా హెచ్చరిక పంపారు. త్రిషను రాజకీయాల్లోకి లాగొద్దని, ఆమెకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో నైనార్ నాగేంద్రన్ బహిరంగంగా స్పందించారు. తన వ్యాఖ్యలు పొరపాటున జరిగాయని తెలిపారు. పార్టీ అఖిల భారత మహిళా విభాగం చీఫ్ వానతి శ్రీనివాసన్, మరో నేత అన్నామలై తనతో మాట్లాడినట్లు వెల్లడించారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే హృదయపూర్వక విచారం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. నాగేంద్రన్ క్షమాపణలతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగినట్లు కనిపిస్తోంది. అయితే ఎన్నికల వేళ రాజకీయాలు ఎంత వేడెక్కుతున్నాయో ఈ ఘటన స్పష్టంగా చూపించింది. సినీ ప్రముఖుల పేర్లను రాజకీయాల్లో ఉపయోగించడం ఎంతవరకు సమంజసమనే చర్చ మాత్రం కొనసాగుతోంది.

# రష్యా నిర్ణయంపైనే పసిడి ధరలు

(మొదటి పేజి (తరువాయి)

సంబంధాలు పునరుద్ధరించుకునేందుకు, అమెరికా డాలర్లలో వాణిజ్యం నిర్వహించేందుకు రష్యా సన్నాహాలు చేస్తున్నట్లు వార్తా ఏజెన్సీ బ్లూమ్‌బర్గ్ తెలిపింది. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీలు తేవాలన్న బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సన్నాహాలకు ఇది పెద్ద ఎదురుదెబ్బే. రష్యా కనుక అంతర్జాతీయ వాణిజ్య సెటిల్‌మెంట్లను డాలర్లలో నిర్వహిస్తే, అమెరికా కరెన్సీకి ఊపొస్తుంది. పసిడిపై పెట్టుబడులు మళ్లీ డాలర్‌కు చేరతాయి. అప్పుడు కేంద్రబ్యాంకులూ బంగారం కొనడం ఆపేస్తాయి. అంతర్జాతీయ పసిడి నిల్వల్లో 20? బ్రిక్స్ దేశాల వద్దే ఉన్నాయని అంచనా. బ్రిక్స్ దేశాలతో అనుబంధం ఉన్న దేశాల నుంచే, అంతర్జాతీయ పసిడి ఉత్పత్తిలో 50? వాటా ఉంది. ఇప్పుడీ దేశాలన్నీ బంగారాన్ని ఉత్పత్తి చేస్తున్నా, అతి తక్కువగా మాత్రమే విక్రయిస్తున్నాయి. ధరలు పెరిగేందుకు ఇదీ కారణమైంది. ఇప్పుడు మళ్లీ డాలర్‌కు మద్దతు పెరిగితే, అమెరికా బాండ్లకు గిరాకీ వస్తుంది. అందువల్ల బంగారంపై పెట్టుబడులు ఉపసంహరించడం ప్రారంభిస్తే ఔన్సు ధర 2027 ఆఖరుకు 3,000 డాలర్లకు దిగిరావ్చని సెబీ నమోదిత మార్కెట్ నిపుణులు అనుజ్ గుప్తా, అమిత్ గోయల్ వంటివారు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే దేశీయంగా 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000-1,00,000 వద్ద స్థిరపడొచ్చని అంచనా వేస్తున్నారు.

# విశాఖ బీచ్‌లో విషాదం

విశాఖపట్నం (తెలుగోడు) ఫిబ్రవరి 16 :

విశాఖ సాగర తీరంలో ఆదివారం విషాదం నెలకొంది. బీచ్‌లో సరదాగా స్నానానికి దిగిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మదిలోని గాయత్రి విద్యా పరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఆదివారం రుషికొండ బీచ్‌కు వెళ్లారు. రేడిసన్ బ్లూ రిసార్ట్ వెనుక ఉన్న సముద్రతీరంలో ఐదుగురు స్నానానికి దిగారు. వీరిలో పి.అరవింద్ కృష్ణ (21) అలల తాకిడికి ఒక్కసారిగా కొట్టుకుపోయాడు. గమనించిన అతని స్నేహితుడు రాజీవ్.. అరవింద్‌కృష్ణను కాపాడే ప్రయత్నంలో అతను కూడా నీటిలో మునిగిపోయాడు. స్పందించిన బ్లూ బీచ్ లైఫ్ గార్డ్ సిబ్బందితోపాటు బోటింగ్ యాజమాన్యం ఇద్దరినీ రక్షించి ఒడ్డుకు చేర్చారు. అపస్మారక స్థితిలో ఉన్న అరవింద్‌కృష్ణను అంబులెన్స్‌లో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అరవింద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి స్వస్థలం రాజమండ్రి. రాజీవ్ అనే విద్యార్థి క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



మాట్లాడుతున్న టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు

# బడ్జెట్‌లో క్రైస్తవులకు పెద్దపీట

*టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు..*

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
బడ్జెట్లో క్రైస్తవులకు పెద్దపీట వేశారని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు అన్నారు. స్థానిక వైయస్సార్ నగర్‌లోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరం చర్చిలో విలేకరుల సమావేశంలో ఈటె స్వామి దాసు మాట్లాడుతూ క్రైస్తవులకు ఈ బడ్జెట్ లో 125 కోట్లు రూపాయలు కేటాయించడంపై రాష్ట్రంలోని క్రైస్తవులు, పాస్టర్స్ హర్షం వ్యక్తం చేస్తున్నారని ఈటే స్వామి దాసు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎంతగానో ఆలోచిస్తుందని అన్నారు. క్రైస్తవులు వ్యాపారం చేసుకొనుటకు స్వయం ఉపాధి కింద సబ్సిడీ లోన్స్ రెండు వేల మందికి 20 కోట్లు రూపాయలు కేటాయించడం జరిగిందని చెప్పారు. 8427 మంది పాస్టర్స్ గౌరవేతనానికి ఈ సంవత్సరము 67 కోట్ల నిధులు ఈ బడ్జెట్లో కేటాయించడం జరిగిందని తెలిపారు. అలాగునీ రెండు వేల మందికి ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. క్రైస్తవులకు వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ కల్పించడానికి సి ఈ డి ఎం కు 3 కోట్ల 97 లక్షలు నిధులు ఇవ్వడం జరిగిందని అన్నారు. మొత్తం 125 కోట్లు బడ్జెట్లో కేటాయించడంపై క్రైస్తవుల జీవితాల్లో వెలుగు నింపడమే అని ఈటె స్వామి దాసు తెలిపారు.
ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ సెల్ నగర అధ్యక్షులు శశికాంత్, రాయలసీమ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్ రెవ ఎస్ కె కృపాదాసు, ఉపాధ్యక్షులు పాస్టర్ అంతోని, పాస్టర్ అది, పాస్టర్ వినయ్ పాస్టరమ్మా రావేకా, పాస్టర్ సులమతి,క్రిస్టియన్ సెల్ నాయకులు సతీష్ పాల్గొన్నారు



ట్రోఫీ అందుకుంటున్న తాడిపత్రి తైక్వాండో క్రీడాకారులు

# రాయలసీమ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో 3వ స్థానం సాధించిన తాడిపత్రి క్రీడాకారులు

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
రాయలసీమ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తాడిపత్రి క్రీడాకారులు మూడవ స్థానం సాధించారని జిల్లా తైక్వాండో కార్యదర్శి సాయి బాబా తెలిపారు. నంద్యాలలోని మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 14,15న నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ లో జరిగిన రెండవ రాయలసీమ క్యూరుగి తైక్వాండో ఛాంపియన్ షిప్-2026 పోటీలలో సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలను నంద్యాల తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారని. రెండు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలలో తాడిపత్రి క్రీడాకారులు కఠిన పోటీని ఎదుర్కొని అద్భుత ప్రతిభ ప్రదర్శించి, జట్టు విభాగంలో మూడవ ఛాంపియన్‌షిప్ ను కైవసం చేసుకున్నారన్నారన్నారు. పోటీల ముగింపు సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో నంద్యాల తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు అచ్చం నాయుడు, కార్యదర్శి వేణుగోపాల్ రావు, కోశాధికారి నాయబ్ రసూల్ ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు.

# శ్రీ మంజునాథ స్వామి ఆలయంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
బెళుగుప్పలో కొలువైన ధర్మస్థలం శ్రీ మంజునాథ స్వామి ఆలయంలో సోమవారం మాస శివరాత్రి పురస్కరించుకొని అర్చకులు చిరంజీవి స్వామి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే స్వామివారికి పంచామృత, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం భక్తులు ఆలయానికి చేరుకొని, స్వామివారి కి పంచామృతాభిషేకం, శ్రీ గౌరీ దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మాసశివరాత్రి సందర్భంగా మహా శివపురాణం చదివి తీర్థప్రసాదాలు పొందారు. కుమ్మర పెద్ద ఈశ్వరప్ప, భార్య రామలక్ష్మి దాతల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు..



ప్రత్యేక అలంకరలో శ్రీ ధర్మస్థల మంజునాథ స్వామి. ఆలయ మండపం

# శివాలయానికి 101 దీపాల ప్రతిమ విరాళం

*సర్పంచ్ మైల ఓంకారమ్మ సాంబశివుడు..*
*ఆలయ ంవద్ద అన్నదానం..*

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
యాడికి మండల పరిధిలోని వేములపాడు గ్రామంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం వేములపాడు గ్రామంలోని శివాలయానికి 101 దీపాల ప్రతిమ వితరణ వేములపాడు గ్రామ సర్పంచ్ మైల ఓంకారమ్మ సాంబశివుడు ఇచ్చారు. వేములపాడు గ్రామంలోని శివాలయం లో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరూ ఉదయము ఆకు పూజ, అభిషేకములు, మరియు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించి భక్తులందరూ తమ తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. కుల మత భేదాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. వేములపాడు గ్రామ సర్పంచ్ మైల ఓంకారమ్మ సాంబశివుడు శివాలయానికి 101దీపాల ప్రతిమను అందజేసి కుటుంబ సభ్యులతో తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



వేములపాడు శివాలయానికి విరాళంగా అందజేసిన 101దీపాల ప్రతిమ



కోన రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు రాజశేఖరయ్య కోన రామలింగేశ్వర స్వామి పార్వతి కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం. పాల్గొన్న భక్తులు

# వైభవంగా కోన రామలింగేశ్వర స్వామి రథోత్సవం

## కన్నుల పండువగా కోన రామలింగేశ్వర స్వామి పార్వతి అమ్మవార్ల కళ్యాణం.. వేలాదిగా తరలివచ్చిన భక్తులు..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
యాడికి మండలంలోని కోన పుణ్యక్షేత్రంలో మహా శివరాత్రి సందర్భంగా సోమవారం కోన రామలింగేశ్వర స్వామి పార్వతి కళ్యాణం, రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి పురస్కరించుకొని ఆదివారం రాత్రి జాగారణ నిర్వహించిన అనంతరం సోమవారం ఉదయం ఆలయ అర్చకులు జంగం రాజశేఖరయ్య పంచామృత అభిషేకం. రుద్రాభిషేకం, నైవేద్యం, మహా మాంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తుల ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వ రుల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి కోనుప్పలపాడు, యాడికి, కొలుపల్లి, ఓబులాపురం, కుందనకోట, గుడి పాడు, కత్తి మానుపల్లి, బూర్గుల తదితర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.
అనంతరం రథోత్సవం వేడుకగా జరిగింది. స్వామివారి రథోత్సవానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. 3 గంటల సమయంలో ఆలయం వద్ద నుండి రామలింగేశ్వర స్వామి పార్వతి విగ్రహాలకు పల్లకిలో తీసుకుని వెళ్లి అందంగా అలంకరించిన రథం వద్ద ప్రత్యేక హటరీమాలు నిర్వహించి అనంతరం రథంపై స్వామి వారిని ఉంచి రథోత్సవం నిర్వహించారు. వేలాదిమంది భక్తజనం శివనామస్మరణతో మారుమోగింది. యువకులు, భక్తులు రథం లాగడానికి పోటీ పడ్డారు.
భక్తులు కోనేటిలో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. అంగళ్లు భక్తులతో కిటకిటలాడాయి. రాయలచెరువు గ్రామానికి చెందిన వేదవతి పాఠశాల యాజమాన్యం నాగేంద్ర కుటుంబ సభ్యులు కళ్యాణానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రథోత్సవంలో ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎఎస్ఐ విజయ్ గౌరీ. హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ రెడ్డి , పోలీసులు, సాగర్ పెన్నా సిమెంట్ సెక్యూరిటీ గార్డ్ గట్టి భద్రత ఏర్పాటు చేశారు. మంగళవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు అర్చకులు జంగం రాజశేఖరయ్య తెలిపారు.



కోన రామలింగేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కోనేరులో స్నానం చేస్తున్న భక్తులు



రథోత్సవంలో పోలీసుల బందోబస్తు



కోన రామలింగేశ్వర స్వామి ఆలయ వద్ద భక్తుల సందడి. దుకాణాల వద్ద భక్తుల సందడి

# మస్జిదే గౌసే ఆజం మజీద్, మదరస ప్రారంభం

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
స్థానిక ఏటిగడ్డ పాలెం బైపాస్ రోడ్డు వద్ద దాతల సహకారంతో దాదాపు 25 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మస్జిదే గౌసే ఆజం మజీద్, మదరసను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మసీదులోనే ఏర్పాటు చేసిన మదరసకు శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి వితరణ గావించిన లక్ష రూపాయలు విలువ చేసే 4 కంప్యూటర్‌లను ముస్లిం బాలబాలికల కంప్యూటర్ శిక్షణ కోసం మదరసా పెద్దలకు అందచేశారు. ముస్లిం బాల బాలికల ఆధునికత కోసం తాము అవసరమైన అన్ని వసతులను కల్పిస్తానని జేసీ ప్రభాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. ముస్లింలు వివాహాలలో మాంసాహార విందును ఇవ్వడం మానుకోవాలని కోరారు. మాంసాహార విందు పేదలకు భారంగా మారిందని, ముస్లిం మతపెద్దలు మార్పుకి శ్రీకారం చుట్టాలన్నారు. మాంసాహారం లేకుండా వివాహం చేసుకునే వారికి 20వేల రూపాయల నగదును కానుకగా అందజేస్తామని తెలిపారు. రంజాన్ మాసంలో అర్హులైన ముస్లింలకు వక్ఫ్ బోర్డు తరుపున రుణాలు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ నూతన మజీద్, మదరసలో మత గురువులు ప్రత్యేక ప్రార్ధనలు గావించారు. అనంతరం అల్లా రసూలుల్లాహ్ వారి పవిత్రమైన ఖురాన్ షరీఫ్ గ్రంథంలోని ఆధ్యాత్మికమైన విషయములను బయాన్ ప్రసంగం చేశారు. తదనంతరం మధ్యాహ్నం విందు భోజనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు అధ్యక్షులు మహమ్మద్ అయుబ్, తెలుగుదేశం పార్టీ నాయకులు హిరాపురం నియాజ్ బాషా, హిరాపురం గయాజ్ బాషా(మున్నా), మునిసిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి, మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ రహమాన్, గోరా, నజీర్, నూర్, నాసిర్, షమీర్, నూర్ బాషా దూదేకుల సంక్షేమ సంఘం సభ్యులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



మజీద్‌లో ముస్లిం మతపెద్దలతో



ఎమ్మెల్యే అందజేసిన కంప్యూటర్‌లతో కమిటీ సభ్యులు. మజీద్ ప్రారంభోత్సవానికి హాజరైన ముస్లిం, నూర్ బాషా సోదరులు



వైద్యాధికారి డాక్టర్ ప్రియాంకకు వైద్య పరికరాలు అందజేస్తున్న ఎస్బిఐ మేనేజర్ నాగ సుబ్రహ్మణ్యం,

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎస్‌బిఐ చేయూత

*2లక్షల విలువ గల సామాగ్రి వితరణ..*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల కేంద్రమైన బెళుగుప్ప లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సుమారు 2 లక్షల విలువ చేసే వైద్య సామాగ్రి, వాటర్ ప్యూరిఫైయర్ ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ వారు వితరణ చేశారు. సోమవారం స్థానిక ఎస్బిఐ బ్రాంచ్ మేనేజర్ నాగ సుబ్రహ్మణ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని ఎస్బిఐ రీజినల్ మేనేజర్ శశిధర్ కుమార్ సహకారంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ వారు పాన్ ఇండియా సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా అవేర్ గ్రూప్ తో కలిసి సుమారు 2 లక్షల విలువ చేసే రోగులకు అవసరమైన వైద్య పరికరాలు( సీటీజీ మిషన్), కంప్యూటర్ సెట్, లేబర్ రూమ్ టేబుల్, 3.5 కె.వి ఇన్వర్టర్, ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ ను మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఇతర వైద్య సిబ్బందికి అందజేశారు. రోగులకు అవసరమైన వైద్య పరికరాలు, వాటర్ ప్యూరిఫైయర్, ఇతర సామాగ్రిని అందించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి, ఆవేర్ గ్రూప్, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ శశిధర్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ నాగ సుబ్రహ్మణ్యం కు వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్బిఐ సిబ్బంది ఎర్రి స్వామి, సురేష్, మహేష్, వైద్య సిబ్బంది విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# ఎన్నో ఏళ్ల కల... నెరవేరిన వేళ...

*పయ్యావుల సోదరుల సహకారంతో ప్రజలకు సులభ్ కాంప్లెక్స్..*
*పనులను పర్యవేక్షించిన టిడిపి నాయకులు..*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల కేంద్రమైన బెళుగుప్ప కు వివిధ పనుల నిమిత్తం వచ్చే గ్రామాల ప్రజల కు అత్యంత అవసరమైన మూత్ర విసర్జన శాల( సులబ్ కాంప్లెక్స్ ) లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే ఈ సమస్యను స్థానిక టీడీపి జిల్లా నాయకులు మల్లికార్జున, పెద్దతిప్పయ్య లు పయ్యావుల సోదరులు మంత్రి పయ్యావుల కేశవ్, సోదరులు పయ్యావుల శ్రీనివాసులు దృష్టికి తీసుకుని వెళ్లడంతో సుజిలాన్ వారి సహకారంతో ప్రధాన బస్టాండ్ సమీపంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు పూర్తి కావడంతో టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, పెద్దతిప్పయ్య లు సోమవారం పరిశీలించారు. తొందర్లోనే ప్రజలకు సులబ్ కాంప్లెక్స్ ను వాడుకలోకి తెస్తామన్నారు. ఎన్నో ఏళ్లుగా వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలతోపాటు, స్థానికంగా బస్టాండ్ లో ఉండే వివిధ దుకాణాల మహిళలకు మూత్ర విసర్జనశాలల నిర్మాణాలు పూర్తి చేయడంతో టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు...



బెళుగుప్ప ప్రధాన బస్టాండుకు సమీపంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి కావడంతో పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా నాయకులు మల్లికార్జున, పెద్ద తిప్పయ్య

# నేడు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

*మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక ..*

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
జాతీయ నులిపురుగు నివారణలో భాగంగా నేడు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు అల్బెండజోల్ టాబ్లెట్లు వేస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు నులి పురుగు వలన ఏర్పడే సమస్యలను అవగాహన కల్పించి, ఆరోగ్య సలహాలను అందించి ప్రతి విద్యార్థికి అల్బెండజోల్ టాబ్లెట్లను వేసేందుకు వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నామన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంలో ముందడుగు

## పిజిఆర్ఎస్‌లో 35 ఫిర్యాదులు స్వీకరణ.. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్..



ప్రజా సమస్యల పరిష్కార దినోత్సవంలో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్

**పుట్టపర్తి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు శ్రీ సత్య సాయి జిల్లా పోలీసులు పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఈ క్రమంలో సోమవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ పాల్గొని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మొత్తం 35 పిటీషన్లు అందాయి. ప్రతి పిటీషనర్ సమస్యను జిల్లా ఎస్పీ స్వయంగా లోతుగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వెంటనే స్పందించాలని ఆదేశాలు జారీ చేశారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన చర్యలు తీసుకుని, నిర్ణీత గడువులోగా చట్టపరమైన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.
ప్రజల ఫిర్యాదులను పూర్తి స్థాయిలో విచారించి, సాధ్యమైనంత వరకు మొదటిసారే చట్ట పరిధిలోనే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు పోలీసులు తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకం కల్పించేలా అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.
ఈరోజు జరిగిన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, ఆర్థిక వివాదాలు, భూ సమస్యలు తదితర వ్యక్తిగత మరియు సామాజిక సమస్యలకు సంబంధించిన 35 ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు ప్రారంభించారు. ప్రజలకు న్యాయం జరిగేలా పారదర్శకంగా వ్యవహరించాలనే దృఢ సంకల్పంతో జిల్లా పోలీసులు పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల సమస్యలను వినడానికి జిల్లా స్థాయిలో ఈ విధమైన వేదికలు ఏర్పాటు చేయడం ద్వారా పోలీసులపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


శ్రీ దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వర స్వామి

# శ్రీ దత్తాత్రేయ ఆశ్రమంలో నేడు భక్తులకు అన్నదానం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలో హేమావతిలో వెలిసిన శ్రీ దత్తాత్రేయ గురుకుల ఆశ్రమంలో మంగళవారం శివరాత్రి సందర్భంగా బ్రాహ్మిని ముహూర్తం నందు శ్రీ దత్తాత్రేయునికి అభిషేకం రుద్రాభిషేకం ,గీతా పారాయణం, శ్రీ గాయత్రీ దేవి కి పుష్పాలతో అలంకరణ, లలిత సహస్ర పారాయణం, శ్రీ అభయ ఆంజనేయ స్వామికి అభిషేకం, రుద్రాభిషేకం పూజలు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వర స్వామి నిర్వహిస్తారని పేర్కొన్నారు. గుడిబండ మండలం ఉల్లి కెరే గ్రామవాసులు జగన్నాథ్ సతీమణి శోభారాణి వీరు మజ్జిగ, కేసరి బాత్ అందజేయనున్నట్లు వారు తెలిపారు. క్రీస్తు శేషులు తిమ్మప్ప నాగమ్మ జ్ఞాపకార్థం మజ్జిగ, కేసరి బాత్ భక్తులకు అందజేయనున్నట్లు జగన్నాథ్ తెలిపారు. శ్రీ దత్తాత్రేయ ఆశ్రమం నందు పీఠాధిపతులు శ్రీ సిద్దేశ్వర స్వామి అన్నదానం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ దత్తాత్రేయ స్వామి, శ్రీ గాయత్రీ దేవి, శ్రీ అభయ ఆంజనేయ స్వామికి మొక్కుబడును తీర్చుకోవాలని వారు కోరారు.

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు 556వ జయంతి వేడుకలు

## రాయలసీమను రతనాల సీమగా శ్రీకృష్ణదేవరాయలు మార్చారు.. కదిరింటి శ్రీరాములు.. శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాలి.. మాసపల్లి సాయికుమార్ ..


కృష్ణదేవరాయల విగ్రహం ముందు బలిస సంఘం నాయకులు

**ముదిగుబ్బ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ధర్మవరంలో శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతిని బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బలిజ కళ్యాణమండపం వద్ద నుండి తట్టరు బజార్, అంజుమాన్ సర్కిల్, పిఆర్టి స్టేట్, కళా జ్యోతి సర్కిల్, కాలేజ్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలవేసి బలిజ సోదరులు నివాళులర్పించారు.
ధర్మవరం బలిజ సంఘం తాత్కాలిక అధ్యక్షుడు కదిరింటి శ్రీరాములు మాట్లాడుతూ తన పరిపాలనా విధానాలతో కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బీజం వేసిన దార్శినికుడు శ్రీకృష్ణదేవరాయులు అని కొనియాడారు. ఆయన పాలన గతించి వందల ఏళ్లు గడుస్తున్నా ఆయన సాధించిన అభివృద్ధి, పరిపాలనలో ప్రవేశపెట్టిన విధానాలు నేటికీ కొనసాగుతుండడం విశేషమన్నారు.
రాయలసీమను రతనాల సీమగా శ్రీకృష్ణదేవరాయలు మార్చారన్నారు. మాసపల్లి సాయికుమార్ మాట్లాడుతూ.. దేశభాషలందు తెలుగు లెస్స అని


ర్యాలీ నిర్వహిస్తున్న బలిజ సంఘం నాయకులు

మన మాతృభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు అని కీర్తించారు.
రత్నాలు రాసులుగా పోసి అమ్మినటువంటి ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కింది. అంతే కాకుండా చెరువులు, కుంటలను తవ్వించడం, గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు, పురాతన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్న దేవాలయాలు. కనుకనే నేటికీ గొప్ప పరిపాలనాధక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. మనమందరం శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు.
ఫణి కుమార్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహా కీర్తిశాలి అని తెలిపారు. ఆయన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు.
అనంతరం శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కదిరింటి శ్రీరాములు, మాసపల్లి సాయికుమార్, పసుపులేటి కళ్యాణ్, సంకు అఖిల్, ఫణి కుమార్, సంద్రా రమేష్, అరవింద్, గుండ్లపల్లి ధనుంజయ, పెద్దిరెడ్డి గారి శ్రీనివాసులు, దాసరి సురేష్, శ్యామ్, ఏసీ రాజా, కాశి, కొత్తపేట రవి, సన్ డైరెక్ట్ రమేష్, రామంజి, మహేష్, లోనుకోట బాబు, మిరియాలు అంజి, బలిజ సోదరులు పాల్గొన్నారు.


టోర్నమెంట్ విజేతలతో మండల ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్

# ఐ జి హెచ్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ విజేతకు 25 వేలు నగదు బహుమానం

### మండల టిడిపి ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ యాదవ్..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
శివరాత్రి పండుగ సందర్భంగా ఇరిగేపల్లి గొల్లహట్టి , మధుడి గొల్లహట్టి ఐ జి హెచ్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ లో విజయం సాధించిన గ్యాంగస్టర్ ఐ జి హెచ్ మొదటి స్థానం మరియు రన్నప్ గా సైలెంట్ వారియర్స్ జట్టు విజయం పొందారు. ఈ సందర్భంగా టీడీపీ అగళి మండలం ప్రధాన కార్యదర్శి డి. విశ్వనాథ్ యాదవ్ మరియు ప్రకాష్ యాదవ్ గ్రామస్తులు పాల్గొని విజయం పొందిన గ్యాంగస్టర్ ఐ జి హెచ్ టీం కు 25000 రూపాయల నగదును బహుమతి అందించారు.


గద్దెపై కొలువుదీరిన వీరనారాయణ స్వామి

# అత్యంత వైభవంగా వీరనారాయణ స్వామి ఉత్సవం

**ముదిగుబ్బ (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండలంలోని సంకేపల్లి సమీపాన పరుసమాండ్లలో సోమవారం వీరనారాయణ స్వామి వార్షిక ఉత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడింది. తెల్లవారుజామున కమ్మవారిపల్లిలోని దేవాలయం నుండి స్వామివారిని సంప్రదాయబద్ధంగా మేళతాళాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి పరుసమాండ్లలో గద్దెపై ప్రతిష్ఠించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొని భక్తులతో కిటకిటలాడింది. అనంతరం ఉరుములోలు ఉరుములు వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం పరిసర ప్రాంతాల నుండి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటూ ముక్కులు చెల్లించుకుని స్వామివారికి కృతజ్ఞతాభివందనాలు సమర్పించారు. ముదిగుబ్బ, బుక్కపట్నం, బత్తలపల్లి మండలాల ప్రాంతాలకు చెందిన రైతులు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో గద్దె చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పంటలాభం, కుటుంబ సౌఖ్యం కోసం స్వామివారిని ప్రార్థిస్తూ రైతులు భక్తి భావంతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు మరుగుదొడ్లు, తాగునీరు, ప్రసాదం, పార్కింగ్ వంటి సౌకర్యాలను సమర్థవంతంగా ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ శివరాముడు సిబ్బందితో గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం మీద వీరనారాయణ స్వామి ఉత్సవం భక్తి, ఆనందం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా విజయవంతంగా ముగిసింది.



ఏటి గంగమ్మ దేవాలయం


శ్రీ సత్యనారాయణ పూజలు నిర్వహిస్తున్న సింగిల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్

# శ్రీ సత్యనారాయణ స్వామి పూజ

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలో అంజన్న స్వగృహంలో శ్రీ సత్యనారాయణ స్వామి పూజా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ సత్యనారాయణ స్వామి పూజల్లో సింగిల్ విండో అధ్యక్షులు ఎన్ గణేష్, సిర నియోజకవర్గం జె.డి.ఎస్. పార్టీ అధ్యక్షులు ఉగ్రేష్ మాజీ ఎంపీపీ రామిరెడ్డి, టిఎస్టియుసి కార్యదర్శి మంజన్న, మాజీ సర్పంచ్ ప్రకాష్, క్లస్టర్ కో కన్వీనర్ చెన్నప్ప ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్ రెడ్డి హాల్బూర్ శివప్ప నాగరాజు చిక్కన్న ఆనంద్, మంజు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో అధ్యక్షులు గణేష్, జెడిఎస్ పార్టీ అధ్యక్షులు ఉగ్రేష్‌కు సన్మానం చేశారు.

# వైభవంగా శ్రీ వీరనారాయణస్వామి జాతర


ప్రత్యేక అలంకరణలో రామాపురం శ్రీవీరనారాయణ స్వామి

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
శివరాత్రి పర్వదినం అనంతరం మండలంలోని రామాపురం గ్రామంలో నిర్వహించిన శ్రీ వీరనారాయణస్వామి జాతరను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. సోమవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. అనంతరం సమీపంలోని చిత్రావతి నది వద్దకు ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఎగువ గుడి అర్చకులు కప్పల నరేంద్ర, రామప్ప, నారప్పలు, దిగువగుడి అర్చకులు కప్పల నంద, నారాయణస్వామి, నాగన్నలు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ జాతరకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతులు తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను రంగురంగుల కాగితాలతో అలంకరించుకుని ఊరేగింపుగా స్వామివారి వద్దకు చేరుకున్నారు. స్వామివారి చుట్టూ ప్రదక్షిణలు చేసి కానుకలు సమర్పించారు. జాతర సందర్భంగా స్వామివారి భవిష్యవాణి వినిపించారు. ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని, వర్షాలు మోస్తరుగా కురుస్తాయని, పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని భవిష్యవాణిలో తెలిపారు. ఈ భవిష్యవాణి ప్రతియేటా నిజమవుతోందని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. జాతరలో పలు దుకాణాలు వెలిశాయి. ఎండసెగ తగలకుండా భక్తులకు మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పలువురు దాతలు పంపిణీ చేశారు. మండలంలోని గంటాపురం, మాల్యవంతం తదితర గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ సోమశేఖర్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


రామాపురం వద్ద భవిష్యవాణిని వినిపిస్తున్న అర్చకులు. రామాపురం జాతరకు తరలివచ్చిన భక్తులు


జిడిఎస్ అధ్యక్షులు ఉగ్రేష్, సింగిల్ విండో అధ్యక్షులు గణేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం శ్రీ సత్యనారాయణ స్వామి పూజల్లో పాల్గొన్న దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు


శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకల్లో పాల్గొన్న బలిజ నాయకులు

# ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలు

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలోని రావుడీ పంచాయితీ ఆలూడి గ్రామంలో సోమవారం సాయంత్రం రావుడి బలిజ సంఘం అధ్యక్షుడు మాస్టర్ నరసింహారాజు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు భాను ప్రకాష్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయలు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణదేవ రాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేసి పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలన సాగించిన మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని అన్నారు. రాయల పాలన గురించి వివరించారు. దేశభాషలందు తెలుగు లెస్స అని మన మాతృ భాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణ దేవరాయలు అని కీర్తించారు. దేశంలోనే రత్నాలను రాసులుగా పోసి అమ్మినటువంటి ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కింది. అంతే కాకుండా చెరువులు, కుంటలను తవ్వించడం, గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు, పురాతన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా దేవాలయాలు ఉన్నాయి. కనుకనే నేటికీ గొప్ప పరిపాలనా ధక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. శ్రీకృష్ణదేవ రాయలు చరిత్ర అమోఘమని ఆయన ఎంతోమందికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో రావుడి బలిజ సంఘం అధ్యక్షుడు మాస్టర్ నరసింహారాజు, జనసేన పార్టీ అధ్యక్షులు భాను ప్రకాష్ , బలిజ సంఘ నాయకులు ఈశ్వర, కృష్ణప్ప, నవీన్, ఉమేష్ , మంజునాథ్, ఆర్మీ ఉమేష్, డీలర్ మంజునాథ్, రాజన్న, కుల బాంధవులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవరాయల జయంతిని జరుపుకుంటున్న బలిజ నాయకులు

# ఘనంగా శ్రీ కృష్ణదేవరాయల జయంతి వేడుకలు

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకొని స్థానిక గ్రంథాలయ ఆవరణంలో వెలసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి సోమవారం పాలాభిషేకం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ప్రభుత్వమే అధికారకంగా నిర్వహించాలని కోరారు. మాతృభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలని కీర్తించారు. దేశంలోనే రత్నాలు రాసులుగా పోసి అమ్మిన ఘన చరిత్ర కేవలం శ్రీ కృష్ణదేవరాయల వారికే దక్కిందని అంతే కాకుండా చెరువులు,కుంటలను తవ్వించడం,గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు పురాతన కట్టడాలు నేటికీ కూడ చెక్కుచెదరకుండా ఉన్న దేవాలయాలు. నేటికీ గొప్ప పరిపాలనాధక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు.
ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులుడాక్టర్. వెంకటరమణప్ప బలిజ సంఘం నాయుకులు పవన్ కుమార్, మురళి, శివరాజ్ రామకృష్ణారెడ్డి, కిట్టప్ప రామన్న, సిద్దేశ్ పరమేష్, శివన్న తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న బలిజ సంఘం నాయకులు



హులికన్విలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

## హులికన్విలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

### గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హులికన్వి గ్రామంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండల సభ్యులు పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి సహకారంతో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ నిధులతో గ్రామ సర్పంచ్ చిన్న మహదేవ, వైసీపీ నాయకులు తిమ్మప్ప, నాగప్ప, గవిగట్టు తిక్కయ్య, పెద్ద మహదేవ, గ్రామ పెద్దలు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిన్న మహదేవ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనయే లక్ష్యంగా పని చేస్తామని వెల్లడించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టునట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

## బడ్జెట్‌పై సిపిఎం నిరసన

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఎం కోసిగి మండల కమిటీ సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు రాముడు, వీరేష్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కొరకు గానీ పరిశ్రమలు ఏర్పాటు కానీ బడ్జెట్లో ఎక్కడ నిధులు కేటాయించలేదని వారు ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతము, ఎక్కువ వలసలు పోయే ప్రాంతం కూడా కర్నూల్ జిల్లా అని ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలన్న వలసలు ఆపాలన్న ఈ ప్రాంతంలోసాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని కానీ ప్రభుత్వం అధికారంలో రాకముందు మేము అధికారంలోకొస్తే ఆర్డీఎస్ కుడికాలువ నిర్మిస్తామని గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తానని వేదవతి రిజర్వాయర్ నిర్మించి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి వలసలు ఆపుతామని చెప్పి రెండు సంవత్సరాలు అయినా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ఈ ప్రాంత ప్రజలను మోసం చేయడమేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బడ్జెట్ సవరించి ఆర్డీఎస్ కుడికాలువ నిర్మాణానికి వేదవతి రిజర్వాయర్ గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మాణానికి అదేవిధంగా పరిశ్రమలో నిర్మాణానికి జిల్లా సమగ్ర అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రెప్ప ,గోపాల్, రంగా, హనుమంతు, చిన్నన్న, ప్రజాసంఘాల నాయకులు మధు, వలి, నారాయణ, ఈరన్న, వెంకటేష్, ఉరుకుందు, దేవరాజు,ముకిరప్ప, మహాదేవ తదితరులు పాల్గొన్నారు..



శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## ఘనంగా శ్రీకృష్ణ దేవరాయలు జయంతి వేడుకలు

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ఎమ్మిగనూరు పట్టణంలో కాపు బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ దేవరాయల 556వ జయంతిని వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు బలిజ సంఘం నాయకులు రిటైర్డ్ డిఈ నాగేశ్వరరావు, కరణం రవి, శరత్ కుమార్ మాట్లాడుతూ దేశభాషలందు తెలుగు లెస్స అని, మన మాతృభాష వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు విజయనగర సామ్రాజ్యాధీశుడు, దక్షిణ భారతదేశ మహా చక్రవర్తి, ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణ దేవరాయలు 556వ జరుపుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు. రాయలవారి పరిపాలనలో వజ్రా వైడూర్యాలను రాసులుగా పోసి అమ్మించిన చరిత్ర శ్రీ కృష్ణదేవరాయలకే దక్కిందన్నారు. దక్షిణ భారతదేశంలో అనేక దేవాలయాలు నిర్మించారని, అలాగే అనేక చెరువులు బావులను తవించిన చరిత్ర కూడా ఆయనకే చెందుతుందని వారు కొనియాడారు. అంతేకాకుండా హిందుత్వం కోసం అనేక రకాలుగా కృషి చేసిన మహానుభావుడు పుట్టిన కులంలో పుట్టినందుకు చాలా గర్వంగా ఉందని వారు అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకొని రిటైర్డ్ డిఇ. నాగేశ్వరరావు డాక్టర్ నాగరాజుకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజ కుమారి, దేవేంద్ర రెడ్డి, హౌసింగ్ డిఈ ప్రసాద్, కాంట్రాక్టర్ తిమ్మరాజు, జి.తిమ్మరాజు, వీరేష్, వెంకటేష్, ఎన్ జి.గిరి, రామకృష్ణ, కృష్ణ, రవి, యోగా మాస్టర్ దామోదర్, జాలవాడి శివ,సుధాకర్, మధు సూధన్, తదితరులు పాల్గొన్నారు.



విశ్రాంత డీఈ నాగేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

# నేడు శ్రీశ్రీశ్రీ సిద్ధారూఢ స్వామి మహా రథోత్సవం

### ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల కేంద్రమైన పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సిద్ధారుఢా స్వామి మహా రథోత్సం మంగళవారం అంగరంగా వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అమావాస్య రోజున స్వామివారికి గంగా జలంతో జలాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు విశేష పూజలు నిర్వహిస్తారు. శ్రీ సిద్ధారూఢా స్వామి మహా రథోత్సవంను నిర్వహించేందుకు మహారథంకు రంగులు, పుష్పాలతో అలంకిరిస్తారు. ఈ మహా రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొంటున్న దృష్ట్యా పోలీసు వారి సహాకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆలయ కమిటి సభ్యులు సత్యనారాయణరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాబురెడ్డి పేర్కొన్నారు. స్వామివారి రథోత్సవాన్ని పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరలి రథోత్సవాన్ని తిలకి స్వామివారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

స్వామివారి చరిత్ర..
సిద్ధారూఢ స్వామివారు కర్నాటక రాష్ట్రంలోని బీదరుకోట గ్రామంలో శ్రీగురు శాంతనల్లప్ప, దేవమల్లమ్మ దంపతులకు మూడవ సంతానంగా 1758 సంవత్సరంలో జన్మించారు. స్వామివారు 5 సంవత్సరాల వయస్సు నుంచి భక్తి మార్గంలో వైపు పయనించారు. ఈ సందర్భంగా ప్రజలకు దైవభక్తిని అలవరిచి సన్మార్గంలో నడిపేందుకు దేశాటన చేపట్టారు.



శ్రీ సిద్ధారూఢస్వామి

అందులో భాగంగా పెద్దకడబూరు గ్రామంలో చాలా ఏళ్లు గ్రామస్తులకు తన దివ్యవాక్యములతో పునీతులను చేశారు. సమాజంలో ప్రజలు దైవచింతనతో శాంతి మార్గాన పయనించాలని సూచించారు. ఇలా స్వామివారు తన జీవితకాలం ప్రజలను భక్తిమార్గంలో నడిపి1851శుక్ల నామ సంవత్సరం శ్రావణ శుద్ధపౌర్ణమినాడు హుబ్బళ్లీ గ్రామంలో స్వామివారు తన దివ్యకాయమును వదిలి శివాదీనము అయినట్లు చరిత్ర చెబుతోంది. ఆనాటి నుండి నేటి వరకు ప్రతి ఏడాది మహాశివరాత్రి తరువాత వచ్చే అమావాస్య నాడు స్వామివారి మహారథోత్సవంను నిర్వహించడం అనవాయితీగా వస్తోంది.



పెద్దకడబూరులో వెలసిన శ్రీ సిద్ధారూఢస్వామి మూల విరాట్. శ్రీ సిద్ధారూఢస్వామితో పాటు ప్రత్యేక పూజలు అందుకున్న నందీశ్వరుడు

# వైభవంగా శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి రథోత్సవం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలో వెలిసిన శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి రథోత్సవం సోమవారం అశేష భక్తవాహిణి నడుమ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు జంగం వీరభద్ర స్వామి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చన, పుష్పభిషేకం, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. సాయంత్రం గ్రామ పెద్ద, మాజీ సర్పంచ్ కీ.శే. గజ్జల వెంకట్రామిరెడ్డి ఇంటి నుంచి కుంభం, కలసంతో ఊరేగింపుగా స్వామివారి రథం వద్ద తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివాలయం నుంచి అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తెచ్చి రథంపై ప్రతిష్టించి స్వామివారి రథోత్సవం అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా సాగింది. రథోత్సవం సందర్భంగా చిన్నారులు, యువకులు కోలాటాలతో విశేషంగా ఆకట్టుకున్నారు. శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ మల్లేష్, మాజీ సర్పంచ్ జి. శివరామరెడ్డి, వ్యవసాయ సలహా మండలి మాజీ సభ్యులు గజ్జల గజేంద్రరెడ్డి, నాయకులు మహాబళేశ్వర్, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం




ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి



స్వామివారి కుంభం, కలశాన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న దృశ్యం

# రమణీయం.. శివపార్వతుల రథోత్సవం

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హెచ్. మురవణి, పెద్దకడబూరు గ్రామాలలో వెలసిన శ్రీ మల్లికార్జునస్వామి ఆలయాల్లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబికాదేవి, మల్లికార్జున స్వాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. శివపార్వతుల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆయా గ్రామాలలో శివపార్వతుల రథోత్సవాలు అశేష భక్తవాహిణి నడుమ రమణీయంగా సాగింది. పెద్దకడబూరు గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ పెద్దలు నరవ రమాకాంతరెడ్డి, నరవ విరూపాక్షి రెడ్డి, నరవ రాజశేఖర్ రెడ్డి, తిమ్మారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాఘవరెడ్డి, మురళీధర్ రెడ్డి, సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబికాదేవి మల్లికార్జున స్వాములకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి రథాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. రామిరెడ్డి ఇంటి నుంచి స్వామివారి కుంభం, కలసంతో ఊరేగింపుగా తెచ్చి రథం వద్దకు తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్టించి రథోత్సవం రమణీయంగా శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ వరకు గ్రామ పురవీధుల గుండా అశేష భక్తవాహిణి నడుమ కన్నుల పండుగగా సాగింది. అలాగే హెచ్ మురవణి గ్రామంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం పురస్కరించుకొని ఆలయ అర్చకులు స్వామివారికి జలాభిషేకం, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి రథాన్ని పుష్పాలతో, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్టించి అశేష భక్తవాహిణి నడుమ రథోత్సవం వైభవంగా జరిగింది. శివపార్వతుల రథోత్సవాలను పురస్కరించుకొని ఎస్ఐ నిరంజన్ రెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వీఆర్వో రామలింగారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, వైసీపీ బూత్ విభాగం తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, నవీన్ రెడ్డి, విజయేందర్ రెడ్డి, టీడీపీ మల్లికార్జున, మీ సేవ ఆంజనేయులు, రెయిన్ బో హైస్కూల్ కరస్పాండెంట్ గోవిందరెడ్డి, ఎంజి, నరసన్న, కలగట్ల లక్ష్మన్న, బొగ్గుల నరసన్న, శరణప్ప, డీలర్ ఆదాము, డీలర్ ఇమ్మానుయేలు, డీలర్ ఆశన్న, బొగ్గుల తిక్కన్న, రామన్న, ఆదాము, సుధాకర్, సందీప్, హెచ్. మురవణి టీడీపీ గ్రామ అధ్యక్షులు బోయ సొంటెన్న, సాగునీటి సంఘం



హెచ్ మురవణిలో శివపార్వతుల లరథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పెద్దకడబూరులో శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



రథోత్సవంలో కొలాటం ఆడుతున్న బాలికలు. చిన్నారుల కోలాటాన్ని పరిశీలిస్తున్న టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**కోసిగి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలోని నేలకోసిగి గ్రామంలో నూతన శ్రీ ఆంజనేయస్వామి , శ్రీరామలింగేశ్వర స్వామి గుడుల అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవం జరిగింది. సోమవారం తెల్లవారుజామున నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం భక్తులు నైవేద్యం సమర్పించి మొక్కలు నేర్చుకున్నారు.ప్రారంభోత్స కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మురళి మోహన్ రెడ్డి , ఎంపీపీ పెండేకల్లు.ఈరన్న , మండల కన్వీనర్ బెట్టన్న గౌడు,లు గ్రామ సర్పంచ్ పశువుల. హనుమంతమ్మ ఆధ్వర్యంలో గుడిల ప్రారంభోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ఆకు పూజ ,మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా అత్యంత సుందరంగా విద్యుదీపాలతో ప్రత్యేకంగా ఆలయాలను అలంకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.పీఠాధిపతుల కు, అతిథులకు గ్రామ పెద్దలు పూలు, శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దశవాయి.మంగమ్మ , జగదీష్ స్వామి, బుళ్ళి.నరసింహులు, గాణిగి.వీరస్వామి, బాపురం.ఆంజనేయులు, లక్ష్మన్న, మల్లయ్య, ఈరన్న, వీరారెడ్డి, కడుబురయ్య, తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్ కేటాయింపులపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

## రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు తీరని అన్యాయం

### సీపీఎం ఆందోళన

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
రాష్ట్ర బడ్జెట్ లో కర్నూలు జిల్లాకు కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పర ఈరన్న స్పష్టం చేశారు.ఏజె సోసోఐమవారం పెద్దకడబూరు గ్రామంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటివల ఎమ్మిగనూరు పర్యటనలో భాగంగా జరిగిన బహిరంగ సభలో పులికనుమ ప్రాజెక్టు, గురురాఘవేంద్ర రిజర్వాయర్ లకు మరమ్మతులకు నిధులు కేటాయిస్తామని ప్రకటన చేశారని గుర్తు చేశారు. అయితే ఇటివల అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో కర్నూలు జిల్లాకు సరియైన నిధులు కేటాయించకుండా తీరని అన్యాయం చేశారని విమర్శించారు. అలాగే ముఖ్యమంత్రి ఎ మాట ప్రకారం పులికనుమ ప్రాజెక్టు, గురురాఘవేంద్ర రిజర్వాయర్ లకు నిధుల కేటాయింపు ఊసే లేకపోవడం దారుణమన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ ప్రాంతంలో వలసలు నివారించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం గాలికి వెదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

## పాలనలో ప్రక్రియలు, నిబంధనల్లో మరింత సరళీకరణ

### బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇచ్చిన అధికారులకు సీఎం అభినందన

**అమరావతి, ఫిబ్రవరి 16 :**
పాలనలో వివిధ ప్రక్రియలను, నిబంధనల్ని మరింత సరళీకరించేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా కొన్ని చట్టాలను కూడా సరళతరం చేసేలా నిర్ణయం తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవలు అత్యంత సులభంగా ప్రజలకు చేరువ కావాలన్నదే తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. దీనిపై అధ్యయనం కోసం ఓ కమిటీ వేయాలని ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్‌పై సీఎం సమీక్షించారు. టెక్నాలజీ అనుసంధానంతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దీనికి అనుగుణంగా ప్రతీ ప్రభుత్వ శాఖ సన్నద్ధం కావాలని.. సులభతరమైన పౌర సేవల్ని అందించాలని సీఎం సూచించారు. టెక్నాలజీ పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కూడా చెల్లింపులు ఇతర ప్రభుత్వ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కోకూడదని... ఆటోమేషన్ దిశగా అడుగులు వేయాలన్నారు. ప్రజల్లో డిజిటల్ లిటరసీ పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వంలోని 8.20 లక్షల మంది ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణా సామర్థ్యాలను మరింత మెరుగు పరుచుకునేలా వివిధ కోర్సుల్లో శిక్షణ తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ కోర్సులను అందించాలని సీఎం సూచించారు. వార్షిక నివేదికల్లోనూ సామర్థ్యాన్ని ప్రతిఫలించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బిల్ గేట్స్ పర్యటన సందర్భంగా ఆర్టీజీఎస్ కేంద్రంలో ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని ఆయన అధికారులను అభినందించారు.



బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, సర్పంచ్ రామ్మోహన్ చౌదరి

# బాల్య వివాహాలను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**బాల్య వివాహాల నిర్మూలన అవగాహన..**

**బెళుగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
బాల్య వివాహాలను నిర్మూలించడం అధికారులు ప్రజాప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి పేర్కొన్నారు. సోమవారం బెళుగుప్ప మండలం పరిధిలోని ఆవులెన్న గ్రామంలో బాల్య వివాహాల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రామ్మోహన్ చౌదరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లేకపోవడంతో కొంతమంది తల్లిదండ్రులు బాల్యవివాహాలను చేస్తున్నారని, బాల్య వివాహాల వలన ఇద్దరికీ చాలా ప్రమాదకరమన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వము బాల్య




ప్రతిజ్ఞ చేస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, సర్పంచ్ రామ్మోహన్ చౌదరి,

వివాహరహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. బాల్య వివాహాల వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయని వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాలను నిర్మూలనకు తమ బాధ్యత అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, సర్పంచ్ రామ్మోహన్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు..

# నడవలేని తల్లి.. కదలలేని కొడుకు...

**వృద్ధాప్యంలో ఆ అవ్వకు పెద్ద కష్టం..**
**ప్రభుత్వ పింఛనే జీవనాధారం ..**
**కన్నీళ్లు తెప్పిస్తున్న వృద్ధురాలి దుస్థితి ..**



విభిన్న ప్రతిభవంతుడైన కూమారుడితో సాలమ్మ

**టి.సుండుపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
"ఆ అవ్వే మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్ళిపోయింది" మహాప్రస్థానం లో శ్రీ శ్రీ రచించిన ఈ వ్యాక్యాలు అభాగ్యులైన వృద్ధుల దీనగాథను తెలియజేస్తాయి. ఈ కవితను పోలిన ఘటన కడప జిల్లా సుండుపల్లి మండలం మడితాడు గ్రామ పంచాయతీలో పలువుకి కంట కన్నీరు తెప్పిస్తోంది. మడితాడు పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లెలో పత్తిపాటి సాలమ్మ (85) వికలాంగుడైన కుమారుడు పత్తిపాటి వెంకటరమణతో కలిసి నివసిస్తోంది. నడవలేని వయసులో ఉన్న తనకు ఏ ఆధారం లేదని, ప్రభుత్వం తన కుమారుడికి ఇచ్చే 6000 వికలాంగుల పింఛన్‌తో జీవనం కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రతి నెల తన కుమారుడు వెంకటరమణకి తనకు మందులకు సుమారు 4000 రూపాయలు ఖర్చు అవుతోందని వివరించారు. సరైన ఇంటి సౌకర్యం కూడా లేదని, ఎప్పుడు పడిపోతుందో తెలియని పూరి గుడిసెలో బిక్కు బిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని సాలమ్మ చెప్పే మాటలు చూపరుల కళ్ళను చెమరుస్తున్నాయి. ప్రభుత్వం పి-4 కింద పేదల నుండి ధనికంగా మార్చే కార్యక్రమాలు చేపట్టి పేదలను దత్తత తీసుకొనే కార్యక్రమాలు చేస్తుంటే, ఇటువంటి సాలమ్మలు అటువంటి పథకాలకు దూరంగానే కనీస హక్కులు అయిన వసతి సౌకర్యం కూడా లేని దుస్థిలోనే మగ్గుతున్నారు. ధనికంగా మారకపోయినా తాను తనువు చలించే లోపు సరైన వసతి అయినా దొరికితే చాలని సాలమ్మ దీనంగా ఆర్థిస్తోంది. ఇంటికి ఒక పింఛను ప్రభుత్వం నిబంధన 85 సంవత్సరాల సాలమ్మకు పింఛను రాకుండా చేస్తోంది. ఇటువంటి నిజమైన అర్హత గల పేదరాలు సాలమ్మ, అతని కుమారునికి సరైన వసతి, ఆరోగ్య సౌకర్యం కల్పించాలని తెలుగోడు దినపత్రిక కోరుతోంది.

# 18న వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలకు ఏర్పాట్లు

**ఎన్ఎస్ పేట (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
శ్రీ ముఖలింగేశ్వర స్వామివారి చక్రతీర్థ స్నానాలు 18 తేదీన నిర్వహిస్తున్నారు .ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.దక్షిణ కాశీ గా ప్రసిద్ధి చెందిన అతి పురాతన శైవ క్షేత్రం శ్రీముఖలింగం పుణ్య క్షేత్రం.మహా శివరాత్రి మహోత్సవాల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగం అత్యంత కీలకమైన ఘట్టం చక్ర తీర్థ తీర్థ స్నానం.ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించి నంది



వంశధార నదిలో బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం



వంశధార నదిలో బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

వాహనం పై పార్వతి పరమేశ్వరులు ఉత్సవ విగ్రహాలు పోలీస్ బందోబస్తు మధ్య ఊరేగింపుగా మండలంలోని మిరియాపల్లి వంశధార నదీ తీరానికి తీసుకువస్తారు.శాస్త్రోక్తంగా పూజలు చేసి స్వామి వారిని చక్రతీర్థం ఆచరించనునున్నారు. ప్రాముఖ్యత కలిగిన చక్ర తీర్థ స్నానాలకు తెలంగాణ, ఆంధ్ర ఓడిశా రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు.వీటి దృష్ట్యా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టతున్నారు. భక్తులు సౌకర్యార్థం వంశధార నదీ లో కర్రలు,ఇనుప రాడ్లు తో క్యూలైన్లు ఏర్పాటుతో పాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు.

# దశ దిశ లేని డొల్ల బడ్జెట్!

బడ్జెట్ అంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి అద్దం పట్టాలి. అన్ని ప్రాంతాల సమతుల్యత కనపడాలి. అన్ని వర్గాల ప్రజలకు మేలు జరగాలి, భవిష్యత్తు తరాలకు దారి చూపాలి. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్,రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దాచిపెట్టి, రాబడులపై ఊహ చేసి,ఒక ప్రాంతానికే పరిమితం చేసి,అబద్ధాలు, అర్ధసత్యాలతో నిండి పోయింది. ప్రస్తుత జమ,ఖర్చులను నిర్వహిస్తూ,బాద్యతలను ప్రజలపై తోసేసింది.అందుకే ఇది దశదిశలేని డొల్ల బడ్జెట్.



కె.వి.ఆర్ విశ్లేషణ

గొర్రెల కాపరి కూడా గత సంవత్సరం ఎన్ని గొర్రెలు ఉన్నాయి, ఎన్ని పిల్లలు పెట్టాయి, భవిష్యత్తులో ఎన్ని పిల్లలు వృద్ధి చెందుతాయి, వాటికి అయ్యే ఖర్చు, వచ్చే ఆదాయం, కుటుంబ ఖర్చు, స్పష్టంగా తెలుసుకొని ముందుకు పోతాడు. అందుకే అతను లాభాల బాటలో పైనుంచి కుటుంబాన్ని మెరుగు దిద్దుకుంటాడు.
రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రభుత్వం కూడా గొర్రెల కాపరిలాగా ఆలోచించాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం అలాకాకుండా యజమాని గొర్రెలను కాపలా కాసే గొర్రెల కాపరి లాగా యజమానికి తెలియకుండా కొన్ని పిల్లలను దాచిపెట్టి,లేకుంటే అమ్మేసి, తప్పుడు లెక్కలు చూపించి తన స్వలాభం కోసం యజమానిని మోసం చేసినట్లు,రాష్ట్రంలో ఐదు సంవత్సరములు ట్రస్టీగా ఉండాల్సిన ప్రభుత్వం రాష్ట్ర సంపదకు యజమాని అయ్యి, ప్రజల మేలు కంటే తమ సొంత ప్రయోజనాలే మిన్న అని ప్రవేశపెట్టిన బడ్జెట్ గా తేటతెల్లమవుతుంది. ఎలాగంటే రెవెన్యూ ఆదాయం 2.34 లక్షల కోట్లు అని చూపించారు.
అయితే 2025-26 లో రెవెన్యూ ఆదాయం1.96 లక్షల కోట్లు మాత్రమే.అంతకుముందు ఏడాది 1.67 లక్షల కోట్లే. అందువల్ల గతంలో ప్రభుత్వం ఇస్తామని చెప్పిన చాలా పథకాలు కాగితాలకే పరిమితమైనాయి.ఇప్పుడు కూడా అలా కాదని ఎలా చెప్పగలం.
ప్రస్తుత బడ్జెట్ లో చూపినట్లు 2.34 లక్షల కోట్ల ఆదాయం వచ్చే పరిస్థితి రాష్ట్రంలో ఉన్నదా? బడ్జెట్ లో కనబరచినట్లు జరగకపోతే బడ్జెట్ లో ఇస్తామని చూపించిన పథకాలు ఏ విధంగా అమలు జరుగుతాయి
ఇలా రాని ఆదాయాన్ని ఊహించుకుని సంక్షేమం,అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పడం బట్టి,ఈ బడ్జెట్ కు బలం లేదని అర్థమవుతుంది.
ఇక రెవెన్యూ లోటు విషయంలో ఇప్పటికే 60,000 కోట్ల రెవిన్యూ లోటు ఉన్నది.అలాంటిది వచ్చే ఆర్థిక సంవత్సరానికి 41 వేల కోట్లకు లోటును నియంత్రిస్తామని చెబుతున్నారే కానీ,ఎలా నియంత్రిస్తారో చెప్పలేదు. నేడు విడిపోయిన రాష్ట్ర ఆదాయ పరిస్థితులు చూస్తే నియంత్రించకపోగా రెవిన్యూ లోటు రెట్టింపు అయ్యే పరిస్థితి కనపడుతున్నది.
అందుకే రివైజ్డ్ ఎస్టిమేట్స్ కు తగ్గట్టుగా బడ్జెట్ లేదు. అందుకే ఈ బడ్జెట్ కు విలువ లేదు.
మూలధన వ్యయం 2024-25 లో 16 వేల కోట్లు ఉంటే2025-26 లో 40 వేల కోట్లుగా చూపించి,దానిని సవరించి 33 వేల కోట్లు ఉంటుందని ఊహలు చేశారు. దీనిని బట్టి ఈ బడ్జెట్ అంచనాలకే పరిమితం తప్ప, ఆచరణ సాధ్యం కాదు, తద్వారా రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు ఉపయోగపడదు.
ఈ బడ్జెట్ కేవలం ప్రస్తుత జమ,ఖర్చులను నిర్వహించడం కోసం పెట్టిన బడ్జెట్ అని తేలిపోయింది. ఇలాంటి మోసపూరితమైన, ఆచరణ సాధ్యం కాని బడ్జెట్లను,పవిత్రమైన చట్టసభలలో ప్రవేశపెట్టే వారిపై రాజ్యాంగ పీఠికలను నిర్వహిస్తున్న రాష్ట్రపతులు, గవర్నర్లు చర్యలు తీసుకోవాలి.తీసుకోకపోగా అదే రాజ్యాంగ పీఠికల నోటి నుండి అబద్ధాలు చెప్పిస్తున్నారు.విచ్చలవిడిగా ఎక్కడైనా,ఎప్పుడైనా ప్రజలను మోసం చేయొచ్చనే సంకేతాలు ప్రజలలోకి పంపిస్తున్నారు.
చివరికి బడ్జెట్ ప్రసంగాలు ఏ స్థాయికి దిగజారాయంటే ఎన్నికలలో పార్టీలు చేస్తున్న తప్పుడు వాగ్దానాల కంటే హీనంగా దిగజారి, చట్టసభలకు గౌరవ, మర్యాదలు లేకుండా చేస్తున్నాయి. వీటిని అరికట్టే బాధ్యత,శక్తి ప్రజల చేతుల్లోనే ఉన్నది,ఓటు అనే బలమైన శక్తితో ఇలాంటి మోసపూరిత శక్తులను అడ్డుకోవాలి,ఎన్నికల వాగ్దానాలను అమలు పరచకపోతే ఇంటికి పంపించాలి,అందుకే ఎన్నికల మేనిఫెస్టోలకు చట్టబద్ధత కల్పించాలి.

**– కె.వి రమణ,**
**రాజకీయ విశ్లేషకులు, అనంతపురం.**

# వైభవంగా శ్రీశైల మల్లన్న రథోత్సవం



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

**కన్నుల పండువగా**
**స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం ..**

**శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాడు మల్లన్న రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామి అమ్మవార్ల తెప్పోత్సవం కన్నుల పండవగానిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఉత్సవ పూజలను అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు అనంతరం సాయంకాలం పూజల్లో భాగంగా గంగాధర్ మండపం వద్దగల రథశాల వద్ద రధాంగ హోమం, రథాంగబలి ఎ కార్యక్రమాలను అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. అనంతరం రథశాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథానికి బలిహర్నాలు చేశారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై వేంచింప చేయించి మరొక మారు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి అమ్మవార్ల





శ్రీశైల మల్లన్న రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అశేష భక్తజన సందోహం నడుమ నిర్వహించిన శ్రీశైల మల్లన్న రథోత్సవం

ఉత్సవమూర్తులకు రథోత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. భక్తులు రథోత్సవాన్ని తిలకించి స్వామి అమ్మవార్లను దర్శించుకుని ఆధ్యాత్మిక భావనకు లోనైనారు. ఈ రథోత్సవం గంగాధర మండపం నుండి నంది గుడి వరకు మరల నంది గుడి నుండి రధశాల వద్దకు చేరుకోవటంతో రథోత్సవం ముగుస్తుంది ఈ రథోత్సవంలో దేవస్థానం వారు ఏర్పాటుచేసిన కళాకారుల విన్యాసాలు గురవాయ నృత్యాలు డప్పు వాయిద్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి

**తెప్పోత్సవం..**
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం రథోత్సవ అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కర్ణి వద్దకు తోడుకొని వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరిణి వద్ద విద్యుత్ దీప కాంతులతో పలు రకాల పుష్పాలతో అలంకరించిన తెప్పపై స్వామి అమ్మవార్లను వేచింపజేయుంచి మరొక మారు మహా మంగళహారతులు ఇచ్చి పుష్కర్ణిలో విహరింపజేయించారు ఈ విశేష కార్యక్రమంలో ఆలయ అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



శ్రీశైల మల్లన్న రథోత్సవంలో కళాకారుల విన్యాసాలు



శ్రీశైల మల్లన్న రథోత్సవంలో కళాకారుల విన్యాసాలు



శ్రీశైల మల్లన్న రథోత్సవం ముందు కూష్మాండబలి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కేకులు కట్ చేస్తున్న బలిజ సంఘం నాయకులు

# రాయలు అడుగుజాడల్లో నడవాలి

**ఘనంగా శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతి వేడుకలు.**
**బలిజ సంఘం నాయకులు, కుల బాంధవులు**

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో శ్రీకృష్ణదేవరాయల 556వ జయంతి వేడుకలను బలిజ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాల వేసి బలిజ సోదరులు నివాళులర్పించారు. అనంతరం కేకులు కట్ చేసి పంచిపెట్టి సంబరాలు జరుపుకొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనమందరం శ్రీకృష్ణదేవరాయల అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. తన పరిపాలనా విధానాలతో కర్ణాటక,ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బీజం వేసిన దార్శనికుడు శ్రీకృష్ణదేవ రాయులు అని కొనియాడారు.ఆయన గతించి వందల ఏళ్లు గడుస్తున్నా ఆయన సాధించిన అభివృద్ధి, పరిపాలనలోప్రవేశపెట్టిన విధానాలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు.రాయలసీమ ను రతనాల సీమగా శ్రీకృష్ణదేవరాయలు మార్చారన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని మన మాతృభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు అని అన్నారు.రత్నాలను రాసులుగా పోసి అమ్మిన ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కింది.అంతే కాకుండా చెరువులు,కుంటలను తవ్వించడం,కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు,పురాతన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి కనుకనే నేటికీ గొప్ప పరిపాలనా ధక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహా కీర్తిశాలి అని తెలిపారు. ఆయన పరిపాలనలో పేద బడుగు బలహీన వర్గాల వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు కుల బాంధవులు బలిజ సోదరులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జయంతి వేడుకలలో పాల్గొన్న బలిజ సోదరులు

# ఆదర్శ పాలకుడిగా చరిత్రలో నిలిచిన శ్రీ కృష్ణదేవరాయలు

**బలిజ సంఘం పెద్దలు, యువత నివాళులు..**

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ఆదర్శ పాలకుడిగా శ్రీకృష్ణదేవరాయలు చరిత్రలో నిలిచారని బలిజ సంఘం పెద్దలు, యువత, నాయకులు కొనియాడారు. సోమవారం శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని నరసంబూది బస్టాండ్ లో శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బలిజ సంఘం నాయకులు, యువత, మహిళలు శ్రీకృష్ణదేవరాయల పేరుతో తయారు చేయించిన భారీ కేకును కట్ చేసి పంచిపెడుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ :- శ్రీకృష్ణదేవరాయల జయంతి,వర్ధంతిని ప్రభుత్వమే అధికారకంగా నిర్వహించాలని కోరారు. రాయల పాలన గురించి వివరించారు.దేశభాష లందు తెలుగు లెస్స అని మన మాతృభాష గొప్పదనాన్నిప్రపంచానికి చాటి చెప్పిన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు అని కీర్తించారు.దేశంలోనే రత్నాలు రాసులుగా పోసి అమ్మినటువంటి ఘన చరిత్ర కేవలం శ్రీకృష్ణదేవరాయల వారికే దక్కింది.అంతే కాకుండా చెరువులు, కుంటలను తవ్వించడం, కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేసిన గొప్ప రాజు కృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఆయన కాలం నాటి దేవాలయాలు,పురాతన కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. కనుకనే నేటికీ గొప్ప పరిపాలనా ధక్షుడిగా ప్రపంచ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. త్వరలోనే నరసంబూది గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ జరుగుతుందని కూడా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు. యువత, మహిళలు. తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల చిత్రపటం వద్దభారీ కేకు కట్ చేస్తున్న బలిజ సంఘం నాయకులు

# ఘనంగా శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామికి అఖండ పూజలు

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలో మద్దనకుంట గ్రామం పొలిమర్లలో వెలిసిన యాదవుల ఆరాధ్య దేవుడు శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామికి అఖండ పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా ఆదివారం తెల్లవారుజాము నుండి సోమవారం ఉదయం వరకు శ్రీ చిత్రలింగేశ్వర స్వామికి అభిషేకం, కుంకుమార్చన, పంచామృత అభిషేకం తదితర పూజలు అర్చకులు నిర్వహించారు. శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామికి భక్తులు తెచ్చిన పూలతో అలంకరణ చేశారు. మహా మంగళ హారతి, తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి యాదవ కులస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ శివ చిత్తలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కుబడును తీర్చుకున్నారు. వచ్చిన భక్తాదులకు శివ చిత్ర లింగేశ్వర స్వామి ఆలయ కమిటీ వారు డీ.జే. రాజన్న, మద్దనకుంటప్ప, చిత్ర శేఖర్ యాదవ్,, రంగప్ప, జి రంగప్ప, తిమ్మాయప్ప , పూజారి చిత్తప్ప, పూజారి రంగప్ప, వీరి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు



శ్రీ శివ చిత్రలింగేశ్వర స్వామికి పూలతో అలంకరణ



శ్రీ శివ చిత్ర లింగేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు. ఆలయ కమిటీ సభ్యులు.

# ఘనంగా శ్రీ సిద్దేశ్వర స్వామి భాను పల్లకి ఉత్సవం

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలో హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం భానుపల్లకి ఉత్సవాన్ని ఘనంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరే గౌడ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయం స్వామివారికి, రుద్రాభిషేకం, అభిషేకం కుంకుమార్చన, వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. సాయంకాలం శ్రీ సిద్దేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని భాను పల్లకి ఉత్సవములో కూర్చోబెట్టి ప్రత్యేకంగా అలంకరణ చేసి పుర వీధులకుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయం చేరుకొని స్వామివారికి మహా మంగళహారతి, తీర్థ ప్రసాదాలు వచ్చిన భక్తాదులకు అందజేశారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.



శ్రీ సిద్దేశ్వర స్వామికి పూలతో అలంకరణ

**నేడు అగ్రిగుండమహోత్సవం..**
శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవంలో భాగంగా మంగళవారం అగ్నిగుండ మహోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కరే గౌడ ఈ.వో. నరసింహారాజు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వలీ భాష, ఏ.ఎస్.ఐ రామాంజనేయులు తెలిపారు.





గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ వాలీబాషా. శ్రీ సిద్దేశ్వర స్వామి అగ్రిగుండం

## శ్రీ దొడ్డేశ్వర స్వామిని సేవలో మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలో హేమావతిలో వెలసిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఆవరణలో ఆదివారం రాత్రి శ్రీ సిద్దేశ్వర స్వామిని , శ్రీ దొడ్డేశ్వర స్వామిని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కుటుంబ సభ్యులు కలసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ దొడ్డేశ్వర స్వామి ని వివిధ రకాల పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కరే గౌడ, శాలువాలు ,పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



శ్రీ దొడ్డేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కుటుంబ సభ్యులు



శ్రీ సిద్దేశ్వర స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల కుటుంబ సభ్యులు దేశం నాయకులు కార్యకర్తలు

శ్రీ దొడ్డేశ్వర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం





సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

# శ్రీ సిద్దేశ్వర స్వామి రథోత్సవం బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షణ

**జిల్లా ఎస్పీ.ఎస్. సతీష్ కుమార్..**

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మహాశివరాత్రి వేడుకల సందర్భంగా అమరాపురం మండలంలో వెలసిన హేమావతి శ్రీ సిద్దేశ్వర స్వామి దేవాలయంలో (మంగళవారం నిర్వహించనునన అగ్నిగుండ ప్రవేశం, రథోత్సవం బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ.ఎస్. సతీష్ కుమార్ సోమవారం పర్యవేక్షించారు. 18న సిడీమానోత్సవం, 19న చిన్న రథోత్సవం, 20,న బ్రహ్మరథోత్సవం వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు ఆంధ్ర, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని, వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వృద్ధులు, మహిళలు మరియు చిన్నారుల కోసం తీసుకున్న ప్రత్యేక సదుపాయాలు, దర్శన క్యూ లైన్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రసాద కౌంటర్లు, మరియు అన్నప్రసాద పంపిణీ వంటి అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, శాంతి భద్రతల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ తో పాటు రూరల్ సి ఐ రాజ్ కుమార్, అమరాపురం ఎస్ఐ వలి భాష సిబ్బంది దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీ సిద్దేశ్వర స్వామి అగ్నిగుండ మహోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్.

# సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ది జరుగుతుందని తుమ్మల అభిప్రాయపడ్డారు. వీటికి సంబంధించిన పలు వివరాలను ముఖ్యమంత్రికి ఆయన తెలియచేశారు. రెండు ప్రభుత్వాలు ఉన్నత స్థాయిలో సంప్రదింపుల ద్వారా ఈ సమస్యల పరిష్కారం జరుగుతుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.



# మధూడిలో వైభవంగా శివపార్వతుల గిరిజా కళ్యాణ మహోత్సవం

**పాల్గొన్న జడ్పిటిసి ఉమేష్..**

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలోని మధూడి గ్రామంలో చోళరాజుల కాలంలో వెలసిన మల్లేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జగన్మాత పార్వతీదేవి, పరమేశ్వరుల గిరిజా కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి ఉమేష్ తో పాటు మండల కన్వీనర్ తిప్పేస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచప్పయాదవ్, మాజీ ఎంపీపీ నంజుండప్ప, విశ్రాంత ఉద్యోగి సోమన్న, తదితరులు పాల్గొన్నారు సోమవారం వేకువ జాము నుండే స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఉదయ్ కుమార్ శాస్త్రి భక్తిశ్రద్ధలతో మంత్రోచ్చరణల మధ్య, మంగళ వాయిద్యాలు మోగుతుండగా కళ్యాణ ఘట్టం ఘనంగా నిర్వహించారు కళ్యాణోత్సవ వేడుకను తిలకించడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం 'ఓం నమశ్శివాయ' అనే శివనామ స్మరణతో మారుమోగింది.వచ్చిన మహిళా భక్తులందరికీ పసుపు కుంకుమ ఒడి బియ్యం అందించారు. ఇరుగుపొరుగు గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న భక్తులందరికీ అన్న ప్రసాదం పంపిణీ చేశారు.అదేవిధంగా నరసంబూది శివాలయానికి జడ్పిటిసి ఉమేష్ వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గిరిజా కళ్యాణం మహోత్సవంలో పాల్గొన్న జెడ్పిటిసి ఉమేష్
నరసంబూది శివాలయంలో ప్రత్యేక పూజలు చేయిస్తున్న జడ్పిటిసి ఉమేష్



ప్రత్యేక అలంకరణలో మధూడి మల్లేశ్వర స్వామి
గంగ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

# శ్రీకృష్ణదేవరాయలుకు బలిజ సంఘం నేతల ఘన నివాళులు

**తనకల్లు (తెలుగోడు), ఫిబ్రవరి 16 :**
మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ శివసాయి కళ్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోరాయలు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నాయకులు, బలిజ, కులస్తులు ఘన నివాళులు అర్పించారు. సభా ప్రాంగణం జై శ్రీ కృష్ణ దేవరాయ జయజయధ్వానాలతో మార్మోగి, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దూరదృష్టి గల పరిపాలకుడిగా, ప్రజాహితాన్ని లక్ష్యంగా పెట్టుకున్న మహానుభావుడిగా శ్రీకృష్ణదేవరాయలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. కర్ణాటక-ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధికి బలమైన పునాది వేసి, వ్యవసాయం, వాణిజ్యం, నీటిపారుదల, సైనిక పరిపాలన రంగాల్లో అపూర్వ సంస్కరణలు చేపట్టిన రాజుగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన పాలన ముగిసి వందల ఏళ్లు గడిచినా, అభివృద్ధి దిశగా చూపిన మార్గదర్శకత్వం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.
తెలుగు సాహిత్య వికాసానికి ఆయన అందించిన ప్రోత్సాహం అపూర్వమని, అష్టదిగ్గజాలను పోషించి తెలుగు భాషకు విశిష్ట గౌరవం తీసుకొచ్చారని గుర్తుచేశారు. కళలు, సంస్కృతి, సాహిత్య రంగాల్లో ఆయన చూపిన ఆదరణ భారత చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిందని వివరించారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొందాలని, సమాజ అభ్యున్నతి కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.
కొక్కంటి క్రాస్‌లో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు చేయాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సభలో తెలియజేశారు. కార్యక్రమం అనంతరం స్నేహసమ్మేళనంగా ముగించారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి పెద్ద వీరయ్య, యూత్ అధ్యక్షుడు కృష్ణతేజ, నియోజకవర్గ అధ్యక్షులు కొండా మల్లికార్జున, నల్లచెరువు అధ్యక్షుడు చంద్ర, బలిజ కులస్తులు, మాజీ జెడ్పిటిసి రవీంద్ర, ఎంపీటీసీలు రమణ, ఆదినారాయణ, సనత్ కుమార్, కొట్టు అస్వర్త్ కుమార్, పీజీ మల్లికార్జున, పలవర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బలిజ సంఘం నాయకులు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న బలిజ సంఘం నాయకులు

# 26న రష్మిక విజయ్‌ల పెళ్లి



మార్చి4న హైదరాబాద్‌లో రిసిప్షన్ అంటూ ప్రచారం టాలీవుడ్‌లో హిట్ ఫెయిర్ హీరో విజయ్ దేవరకొండ-హీరోయిన్ రష్మిక మందన్న పెళ్లి వార్తలు ఇప్పుడు మరింత జోరందుకున్నాయి. వీరు వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారనే ప్రచారం సోషల్ మీడియా, సినీ వర్గాల్లో వైరల్ అవుతోంది. ఫిబ్రవరి చివరి వారంలో వీరి పెళ్లి జరగనుందనే టాక్ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. రాజస్థాన్‌లోని అందమైన నగరం ఉదయ్‌పూర్ లోని ఓ రాయల్ ప్యాలెస్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల మధ్య సింపుల్‌గా పెళ్లి వేడుక జరపాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 26 తేదీని ముహూర్తంగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో చర్చ నడుస్తోంది. ఈ వేడుకను గోప్యంగా ఉంచేందుకు ఎంత ప్రయత్నించినా సోషల్ మీడియాలో సమాచారం లీక్ అవుతూనే ఉండటం గమనార్హం. పెళ్లి వేడుక ఉదయ్‌పూర్‌లో సాదాసీదాగా జరిగినా, అసలు హంగామా మాత్రం హైదరాబాద్ లోనే ఉండబోతుందని టాక్. మార్చి 4న నగరంలోని ప్రముఖ వేదికలో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీ రిసెప్షన్ నిర్వహించనున్నట్లు సమాచారం. టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్‌కు చెందిన పలువురు స్టార్ సెలబ్రిటీలు ఈ వేడుకకు హాజరవుతారని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.ఇటీవల విజయ్ దేవరకొండ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ఆహ్వాన పత్రిక అందించారనే ప్రచారం ఈ పెళ్లి వార్తలకు మరింత బలం చేకూర్చింది. తాజాగా విజయ్ దేవరకొండ వెడ్డింగ్ కార్డ్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇది చాలా సింపుల్‌గా కనిపిస్తుంది. ఈ ఇన్విటేషన్ ప్రకారం వారి వివాహం ఫిబ్రవరి 26న వివాహవం జరగనుందని అర్ధమవుతుంది. రష్మిక - విజయ్‌లతో కలిసి పని చేసిన దర్శకులు, టెక్నీషియన్లు, సన్నిహితులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సెలబ్రిటీ వెడ్డింగ్ రిసెప్షన్‌కు ప్రముఖ దర్శకులు, నిర్మాతలు, స్టార్ హీరోలు హాజరవుతారనే అంచనాలు ఉన్నాయి.

# చిరంజీవి భావోద్వేగం

కోట్లాది మంచి అభిమానుల ఆరాధ్య దైవం చిరంజీవి భావోద్వేగానికి గురయ్యారు. అంతేకాదు.. తన సంతోషాన్ని, ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. కొడుకు రామ్ చరణ్, కోడలు ఉపాసనకు జన్మించిన కవల పిల్లలకు శివరాం, అన్వీరాదేవి అని పేర్లు పెట్టిన సంగతి తెలిసిందే. ఇది రామ్ చరణ్ తీసుకున్న నిర్ణయం. శివరాం అంటే.. కొణిదెల శివంకరవరప్రసాద్ అనే చిరంజీవి అసలు పేరులో శివ అని తీసుకొని దానికి రాముడి పేరు జోడించి శివరాం అని పెట్టారు. అలాగే అమ్మాయికి అన్వీరా దేవి అని పెట్టారు. అంటే చిరంజీవి తల్లి పేరు అంజనాదేవి కాగా, అందులో దేవి తీసుకొని అన్వీరా తర్వాత జోడించి అన్వీరాదేవి అని పెట్టారు. ఇలా కొడుకు పెట్టిన పేర్లు చిరంజీవిని తీవ్ర భావోద్వేగానికి గురిచేశాయి. మన పురాతన సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూ, పెద్దలను గౌరవిస్తూ, వారి పేరు నిలబెట్టేలా ఇటువంటి పేర్లు పెట్టడంపై చిరంజీవి, సురేఖ సంతో సంతోషం వ్యక్తం చేశారు.



# ఫౌజీ షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం



ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ఫౌజీ షూటింగ్‌లో స్వల్ప ప్రమాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. గుర్రపు స్వారీ సన్నివేశం చిత్రీకరణ సమయంలో ప్రభాస్ కింద పడిపోవడంతో చేతులకు చిన్న గాయాలు అయినట్లు సినీ వర్గాలు వెల్లడించాయి. చిత్ర బృందం వెంటనే స్పందించి ప్రథమ చికిత్స అందించగా, గాయాలు తీవ్రంగా లేవని తెలిసింది. వైద్యులు ఒకటి రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ప్రస్తుతం ప్రభాస్ సురక్షితంగానే ఉన్నారని, త్వరలోనే మళ్లీ షూటింగ్‌లో పాల్గొననున్నారని యూనిట్ తెలిపింది. ఈ వార్తతో అభిమానులు తొలుత ఆందోళన చెందగా, గాయాలు చిన్నవేనని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. 'ఫౌజీ' చిత్రానికి హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో సీతారామంతో ప్రశంసలు అందుకున్న ఆయన, ఈసారి మరింత ఎమోషన్‌తో కూడిన యాక్షన్ డ్రామాను భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని టాక్. ఈ సినిమాలో ప్రభాస్ బ్రిటిష్ సైనికుడి పాత్రలో కనిపించ నున్నారని సమాచారం. దేశభక్తి, ప్రేమ, త్యాగం వంటి అంశాలతో కథ నడుస్తుందని తెలుస్తోంది. గుర్రపు స్వారీతో కూడిన హై వోల్టేజ్ చేజింగ్ సన్నివేశం సినిమాకే హైలైట్‌గా నిలవనుందని, భారీ సెట్స్ మరియు
విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సన్నివేశాలను రూపొందిస్తున్నారని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ చిత్రంలో ఇమాన్వీ ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తోంది.



# ప్రమోషన్స్ పూర్తయ్యాక టైటిల్ వివాదాలు

సినిమా ప్రమోషన్లన్నీ పూర్తి చేసుకున్నాక, సరిగ్గా సెన్సార్ సర్టిఫికేట్ వచ్చే సమయంలో టైటిల్ మార్చాల్సి రావడం నిర్మాతలకు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా యంగ్ హీరో సుహాస్ నటించిన సినిమా కూడా ఇదే సమస్యను ఎదుర్కొంది. కేవలం సుహాస్ మాత్రమే కాదు, ఈ మధ్య కాలంలో మరికొన్ని చిన్న సినిమాలు కూడా సెన్సార్ అ÷--జబెక్షన్స్ వల్ల పేర్లు మార్చుకున్నాయి. సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన చిత్రం 'హే భగవాన్'. ఈ నెల 20న విడుదలకు సిద్ధమైన ఈ సినిమాపై సెన్సార్ బోర్డు అభ్యంతరం వ్యక్తం చేసింది. దేవుడి పేరుతో ఉన్న టైటిల్ వల్ల కొన్ని వర్గాల సెంటిమెంట్స్ దెబ్బతినే అవకాశం ఉందని భావించిన బోర్డు, పేరు మార్చాలని సూచించింది. దీంతో మేకర్స్ చేసేదేమీ లేక చివరి నిమిషంలో టైటిల్‌ను 'హే బలవంత్!' గా మార్చారు. ప్రమోషన్లన్నీ పాత పేరుతోనే జరగడంతో ఈ మార్పు సినిమాపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని చిత్ర యూనిట్ ఆందోళన చెందుతోంది. ఇటీవల విడుదలైన 'వానర' చిత్రానికి కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఈ చిత్రంలో కుల రాజకీయాలు మరియు సున్నితమైన అంశాలు ఉండటం, టైటిల్ ఏమో హనుమంతుడిని గుర్తు చేసేలా ఉండటంతో సెన్సార్ బోర్డు నో చెప్పింది. దీంతో ఈ సినిమాను 'వనవీర' పేరుతో విడుదల చేయాల్సి వచ్చింది. ప్రమోషన్ల కోసం ఖర్చు పెట్టిన డబ్బు, టైటిల్ రీచ్ అంతా వృథా అయిందని ఆ చిత్ర దర్శకుడు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శివ కందుకూరి నటించిన 'చాయ్ వాలా' సినిమాకు కూడా సెన్సార్ కష్టాలు తప్పలేదు. ఈ టైటిల్ వాడకూడదని బోర్డు పట్టుబట్టడంతో, చిత్ర యూనిట్ తమ వర్కింగ్ టైటిల్ అయిన 'నవాబ్ కేఫ్'ను ఖరారు చేసింది.

# మార్చిలో రానున్న ఉస్తాద్ భగత్ సింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కుతున్న భారీ మాస్ ఎంటర్‌టైనర్ ఉస్తాద్ భగత్ సింగ్ విడుదలకు సన్నద్ధమవుతోంది. ఇప్పటికే ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో రాశి ఖన్నా, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తుండగా, మాస్ కమర్షియల్ చిత్రాలకు కేరాఫ్ గా ఉన్న ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. సంగీత బాధ్యతలను రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ చేపట్టారు. మార్చి 26న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. సినిమా విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. ఇటీవల విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' లిరికల్ వీడియో అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఈ పాటకు భారీ స్పందన లభించగా, అనేక మంది అభిమానులు వాట్సాప్ స్టేటస్‌లుగా కూడా పెట్టుకున్నారు. పవన్ కళ్యాణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు దేవిశ్రీప్రసాద్ అందించిన ఎనర్జిటిక్ బీట్‌లు జత కావడంతో ఈ సాంగ్ ట్రెండింగ్‌లో నిలిచింది. మొదటి పాట సూపర్ హిట్ కావడంతో సినిమా మీద హైప్ మరింత పెరిగింది. ఇప్పటికే మొదటి సాంగ్ సక్సెస్ కావడంతో రెండో పాట కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో చిత్రబృందం 'ఆరా ఆఫ్ ఉస్తాద్' అనే రెండో సాంగ్‌ను ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ ప్రత్యేక డిజైన్‌తో ఉండి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పవన్ కళ్యాణ్ స్టైలిష్ లుక్, మాస్ అటిట్యూడ్ పోస్టర్‌లో హైలైట్ కావడంతో అభిమానుల్లో ఉత్సాహం మరింత రెట్టింపైంది. గతంలో పవన్ కళ్యాణ్ ? హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన గబ్బర్ సింగ్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించి పవన్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించింది. అదే కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో 'ఉస్తాద్ భగత్ సింగ్' కూడా మాస్ హిట్ అవుతుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా కనిపిస్తోంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.